ఉత్తరం
TG TEL/25/A1234 www.kakatiyanews.com
# కాకతీయ
శనివారం, 15 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 02 | పేజీలు: 8 వెల: 5



బొమ్మరాసిపేటలో 1000 ఎకరాలపై కన్ను
రెవెన్యూ మంత్రి సహకారంతోనే 22 వేల అక్రమ రిజిస్ట్రేషన్లు
వజ్రేష్ యాదవ్, ఉదయ సింహా రెడ్డి, అనిల్ రెడ్డి, అంజి రెడ్డి, ఎ.వి రెడ్డి ఎవరు?
రైతుల భూములను కాపాడే వరకు పోరాటం కొనసాగుతుంది
జాతీయ మానవ హక్కుల కమిషన్ నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్తాం
బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

# భూముల కబ్జా వెనుక రేవంత్ రెడ్డి హస్తం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** బొమ్మరాసిపేట రైతుల భూముల కబ్జా వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తం ఉందని, రెవెన్యూ మంత్రి సహకారంతోనే 22 వేల అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రైతులకు తెలియకుండానే, వారి ప్రమేయం లేకుండానే భూములను ఇతరుల పేర్లకు మార్చుతున్నారని, తెలంగాణలో దొంగల చేతికి భూముల తాళాలు ఇచ్చినట్లుగా పరిస్థితి తయారైందని విమర్శించారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం బొమ్మరాసిపేటలో రైతుల భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహించిన రైతు ధర్నాలో డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బొమ్మరాసిపేటలో రైతులకు

........(తరువాయి 2లో)



# చదువుతోనే తలరాత మారుతుంది

ప్రజాపాలనలో పూలే దంపతుల విధానాలు
అందరూ కలిసే చదివితే కులవ్యవస్థ నిర్మూలన
యంగ్ ఇండియా పాఠశాలలతో విప్లవాత్మక మార్పులు
ఫీజు రీయింబర్స్‌మెంట్ నెల రోజుల్లోనే పూర్తి చేస్తాం
క్రీడల్లో పతకాలు సాధిస్తే ఉద్యోగం, నజరానా
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరణ



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** చదువుతో తలరాత మారుతుందని, ఆత్మగౌరవంతో పాటు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని వర్గాల పిల్లలు ఒకేచోట చదువుతూ, కలిసి జీవించడం ద్వారా కుల వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పులే చూపిన బాటలో ప్రజాపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పులే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మహనీయుల విగ్రహాలను చూసినప్పుడు వారి త్యాగాలు, స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలని

........(తరువాయి 2లో)



## రాజధానిలో త్రివర్ణ శోభ

**స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబైన కీలక భవనాలు**

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రాజధానిలోని సచివాలయం, శాసనసభ, చారిత్రక గోల్కొండ కోట త్రివర్ణ శోభను సంతరించుకున్నాయి. స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో కీలక భవనాలను జాతీయ జెండా రంగులతో అలంకరించారు. రాత్రివేళ త్రివర్ణ కాంతులతో మెరిసిన భవనాలు నగరవాసులను ఆకట్టుకున్నాయి. - కాకతీయ, హైదరాబాద్

2

పీవో సార్ అక్రమ వసూళ్లపై

## చర్యలేవీ

- అక్రమాలు బయటపడ్డా అధికారి మౌనం ఎందుకు?
- కోరేకల్ ఇసుక కాంట్రాక్టర్‌పై విచారణ చేపట్టరెందుకు..?
- వీడియోలు బయటపడినా బాధ్యులపై చర్యలేవీ?
- మూడు రోజులుగా ఆరా పేరిట అధికారి తాత్సారం
- కాంట్రాక్టర్లకు అండగా నిలుస్తున్నారా?



6

## శ్రీనివాసరావుకు కేసీఆర్ నివాళి

- పార్థివదేహానికి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి
- కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు
- అంతిమయాత్రలో కేటీఆర్, హరీశ్‌రావు
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



2



## ‘ఎవరు చేశారు.. అసలు సూత్రధారి ఎవరు?’

- పహల్గామ్ దాడిపై ప్రధాని మోదీ తొలి ప్రశ్న ఇదే
- దాడి సమయంలో విదేశీ పర్యటనలో ప్రధాని
- తిరిగొచ్చిన వెంటనే అధికారులతో అత్యవసర భేటీ
- తక్కువ సమయంలోనే నిందితులను తేల్చిన నిఘా సంస్థలు
- మోదీ స్పందన తీరును వెల్లడించిన అజిత్ దోవల్
- ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిణామాలపై వ్యక్తీకరణ

2

# అమ్మా కోసం స్వదేశీ యుద్ధ విమాన ఇంజిన్

- రిలయన్స్, రోల్స్ రాయిస్ కీలక భాగస్వామ్యం
- భారత్‌లో ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్
- డిజైన్ నుంచి నిర్వహణ వరకు దేశీయంగానే
- రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు మరో ముందడుగు
- విదేశీ సరఫరాలపై ఆధారపడటానికి చెక్
- అనంత్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



**న్యూఢిల్లీ :** కీలకమైన సాంకేతికతల్లో స్వయం సమృద్ధి సాధించడం వ్యూహాత్మక సార్వభౌమత్వానికి ఎంతో అవసరమని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ అన్నారు. రోల్స్ రాయిస్ ప్రపంచస్థాయి నైపుణ్యాన్ని, రిలయన్స్ సాంకేతికత, ఉత్పాదకత, భారీ స్థాయి అమలు సామర్థ్యాలను కలిపి భారత్‌లోనే బలమైన ఏరో ఇంజిన్ వ్యవస్థను నిర్మిస్తామని తెలిపారు. ఇది దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడంతో పాటు ప్రపంచస్థాయిలో పోటీపడేలా చేస్తుందని పేర్కొన్నారు.

........(తరువాయి 2లో)

## రూల్స్ కాగితాలకే పరిమితం

- 32 ఏళ్లుగా అమలుకు నోచుకోని విద్యాశాఖ నిబంధనలు
- ఉమ్మడి జిల్లాలో 900 ప్రైవేటు పాఠశాలలు
- ఫీజుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిందే
- వెబ్‌సైట్‌లో ఒక రేటు.. వసూళ్లలో మరో రేటా?
- రసీదుల్లో ఎంత.. వాస్తవంగా చెల్లించేది ఎంత?




4





## రాజగోపాల్ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం


- ప్రభుత్వ పనితీరుపై సొంత ఎమ్మెల్యే అసంతృప్తి
- తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో ఘాటు వ్యాఖ్యలు
- బహిరంగ విమర్శలపై పీసీసీ ఆగ్రహం
- మంత్రి పదవిపై హామీ ఉందన్న పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్
- క్రమశిక్షణ గీత దాటితే చర్యలేనంటూ హెచ్చరిక

2

## పైసలిస్తేనే పని.. లేదంటే ఫైలు పెండింగ్

- మ్యుటేషన్ నుంచి వారసత్వ మార్పిడి వరకు ఇదే కథ
- ధ్రువీకరణ పత్రాలకూ ‘రేటు’
- భూమి వ్యవహారాల్లో మధ్యవర్తుల హవా
- తనిఖీలు ఉన్నా.. తగ్గని వసూళ్లు
- జనగామలో బాధితులకు ముప్పతిప్పలు

5







## వైరా రోడ్ చర్చి.. వాణిజ్య కేంద్రంగా మారిందా?!

- ఆంధ్ర వెల్ఫేర్ సొసైటీ పేరుతో చర్చి భవనం విక్రయంపై ఆరోపణలు
- చర్చి స్థలంలో భారీ బహుళ అంతస్తుల నిర్మాణం
- ప్రైవేటు వ్యక్తులకు భవనంలోని కొంత భాగం విక్రయించారంటున్న స్థానికులు
- సొసైటీ రికార్డులపై అనుమానాలు..
- కలెక్టర్ దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి?

5

# రాజగోపాల్ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు తన పరిధిని గుర్తించి వ్యవహరించాలని, క్రమశిక్షణ గీత దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ వ్యవహారంపై ఢిల్లీలోని పార్టీ పెద్దలతో చర్చిస్తున్నామని తెలిపారు. నాయకులు తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయకుండా పార్టీ అంతర్గత వేదికలపై చర్చించాలని సూచించారు. తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా కనిపిస్తున్న అంతర్గత అసంతృప్తి తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైంది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసమే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, ప్రస్తుత పాలన కొందరు సీమాంధ్ర వ్యక్తుల చెప్పుచేతల్లో నడవకూడదని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం కొందరు బడా కాంట్రాక్టర్ల స్వప్రయోజనాల కోసం పనిచేయకూడదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఉద్యమ నేపథ్యంపై ప్రశ్నలు**

తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని వారు, కాంగ్రెస్ పార్టీ కోసం ఏనాడూ కష్టపడని వారు కీలక పదవులు అనుభవిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. ఉద్యమ నేపథ్యం లేని వ్యక్తులు రాష్ట్రాన్ని పాలించడం సహించరాని విషయమని అన్నారు. నిజమైన కార్యకర్తలను గౌరవించినప్పుడే తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షలు నెరవేరుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాల ద్వారానే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని చెబుతూనే, ప్రభుత్వ నిర్ణయాలు సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా ఉండాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాలను పక్కనపెట్టి కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఆయన విమర్శించారు. సీమాంధ్ర నేతల ఆశీస్సులతో రాజకీయాలు చేసిన వ్యక్తులు తెలంగాణను శాసించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే పార్టీ, ప్రభుత్వం పనిచేస్తున్న తీరుపై తన అభిప్రాయాలను మాత్రం బహిరంగంగానే వ్యక్తం చేశారు.

**అధిష్ఠానం దృష్టికి వ్యవహారం**

రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు వెలువడిన వెంటనే ఈ వ్యవహారం కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. రాష్ట్ర పీసీసీ నాయకత్వం దీనిని క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. పార్టీపై, ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు చేసే ధోరణి కొనసాగితే శ్రేణుల్లో తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న సమయంలో సొంత పార్టీ ఎమ్మెల్యే నుంచి కూడా తీవ్ర వ్యాఖ్యలు రావడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. పార్టీలో ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సి ఉండగా, బహిరంగంగా మాట్లాడటం వల్ల కార్యకర్తల్లో అయోమయం ఏర్పడుతుందని పీసీసీ నాయకత్వం భావిస్తోంది.

**మంత్రి పదవిపై హామీ ఉందన్న పీసీసీ**

రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి విషయంలో ఇప్పటికే స్పష్టమైన హామీ ఉందని బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ అంశంపై ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా అధిష్ఠానంతో మాట్లాడాలని సూచించారు. ఎవరి సేవలను ఎప్పుడు, ఎలా వినియోగించుకోవాలో పార్టీ నాయకత్వానికి పూర్తి అవగాహన ఉందని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. పార్టీ విధానాలను ధిక్కరించే విధంగా బహిరంగ వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ నాయకులంతా క్రమశిక్షణకు లోబడి పనిచేయాలని, తమ పరిధిని దాటి వ్యవహరించవద్దని సూచించారు. మరోవైపు రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది. సొంత పార్టీ ఎమ్మెల్యే చేసిన విమర్శలకు పీసీసీ అధ్యక్షుడు బహిరంగంగా హెచ్చరికలు జారీ చేయడంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.

# శ్రీనివాసరావుకు కేసీఆర్ నివాళి

- పార్థివదేహానికి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి
- కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు
- అంతిమయాత్రలో కేటీఆర్, హరీశ్‌రావు
- భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తన సతీమణి శోభ సోదరుడు జోగినపల్లి శ్రీనివాసరావు పార్థివదేహానికి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని శ్రీనివాసరావు స్వగృహానికి చేరుకున్న కేసీఆర్.. భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. శ్రీనివాసరావుతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన మరణం కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ఆసుపత్రి నుంచి పార్థివదేహాన్ని నివాసానికి తరలించడంతో బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కడసారి నివాళులర్పించారు.

**శోభను ఓదార్చిన కేసీఆర్**

సోదరుడు శ్రీనివాసరావును కోల్పోవడంతో శోభ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కన్నీటిపర్యంతమైన ఆమెను కుటుంబ సభ్యులు ఓదార్చారు. కేసీఆర్ కూడా ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబంతో శ్రీనివాసరావుకు ఉన్న అనుబంధాన్ని పలువురు సన్నిహితులు గుర్తుచేసుకున్నారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యమిస్తూ.. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలిచేవారని పేర్కొన్నారు. శ్రీనివాసరావు అంతిమయాత్రలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. పాడె మోసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా నిలిచి ధైర్యం చెప్పారు. పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అంతిమ సంస్కారాలకు హాజరయ్యారు. శ్రీనివాసరావు మృతిపట్ల బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు తమ సానుభూతిని తెలియజేశారు. సన్నిహితులు శ్రీనివాసరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన సేవాభావాన్ని స్మరించారు.

**అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు**

బంధుమిత్రులు, పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషుల భారీ హాజరు మధ్య శ్రీనివాసరావు అంత్యక్రియలు హిందూ సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి. శ్రీనివాసరావు మృతి కుటుంబానికి తీరని లోటని పలువురు పేర్కొంటూ.. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని నివాళులర్పించారు.

# ‘ఎవరు చేశారు.. అసలు సూత్రధారి ఎవరు?’

**న్యూఢిల్లీ :** పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి జరిగిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడించారు. ‘‘దాడి చేసింది ఎవరు? దీని వెనుక ఉన్న వ్యక్తి ఎవరు?’’ అని ప్రధాని తొలి ప్రశ్నలు సంధించారని తెలిపారు. భారత సైన్యం చేపట్టిన *‘ఆపరేషన్ సిందూర్’*పై రూపొందించిన డాక్యుమెంటరీలో దోవల్ ఈ వివరాలను వెల్లడించారు. దాడి జరిగిన సమయంలో ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్నారని.. భారత్‌కు తిరిగొచ్చిన వెంటనే విమానాశ్రయంలో అధికారులతో సమావేశమయ్యారని చెప్పారు. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్ సమీపంలోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగిన సమయంలో ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్నారని దోవల్ తెలిపారు. భారత్‌కు తిరిగొచ్చిన అనంతరం విమానాశ్రయంలోనే ఉన్నతాధికారులతో సమావేశమై దాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు ఆరా తీశారని చెప్పారు.

**‘దాడి చేసింది ఎవరు?’**

అధికారులతో జరిగిన సమావేశంలో ప్రధాని అడిగిన తొలి ప్రశ్న ఇదేనని దోవల్ గుర్తుచేసుకున్నారు. దాడి వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థలు ఎవరు? సూత్రధారులు ఎవరు? అన్న విషయాలను తక్షణమే తేల్చాలని ప్రధాని ఆదేశించారని తెలిపారు. దాడి వెనుక అసలు శక్తులను గుర్తించడంపై ప్రధాని ప్రత్యేకంగా దృష్టి సారించారని చెప్పారు. నిందితులను గుర్తించడంలో భారత నిఘా సంస్థలు వేగంగా పనిచేశాయని దోవల్ ప్రశంసించారు. పహల్గామ్ దాడి వెనుక ఉన్నవారిని గుర్తించడంలో భారత నిఘా సంస్థలు కీలకంగా వ్యవహరించాయని దోవల్ పేర్కొన్నారు. ‘‘మన నిఘా సంస్థలకు ధన్యవాదాలు. చాలా తక్కువ సమయంలోనే దాడి వెనుక ఉన్నది ఎవరో తేల్చారు’’ అని ఆయన వెల్లడించారు. దాడి వెనుక లష్కరే తోయిబా, దాని అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నిర్ధారించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**సింధూర్‌కు దారితీసిన దాడి**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 2025 మే 7న ‘ఆపరేషన్ సిందూర్’ చేపట్టింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ బలగాలు దాడులు నిర్వహించాయి. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని మెరుపుదాడులు చేసినట్లు భారత్ ప్రకటించింది. పహల్గామ్ దాడికి కారణమైన ఉగ్రవాద మౌలిక వసతులనే లక్ష్యంగా చేసుకున్నట్లు భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులకు ప్రయత్నించగా.. భారత వాయు రక్షణ వ్యవస్థ వాటిని అడ్డుకున్నట్లు భారత వర్గాలు వెల్లడించాయి. సరిహద్దుల్లో దాదాపు 88 గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. చివరకు 2025 మే 10 సాయంత్రం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. పహల్గామ్ దాడి అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు భారత్ ఉగ్రవాదంపై అనుసరించే విధానంలో కీలక మలుపుగా నిలిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు.



# అమ్మాకా కోసం స్వదేశీ యుద్ధ విమాన ఇంజిన్

(మొదటిపేజీ తరువాయి)

ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్టు అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం స్వదేశీ యుద్ధ విమాన ఇంజిన్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసే దిశగా రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కు చెందిన రోల్స్ రాయిస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం ఇరు సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ భాగస్వామ్యం కేవలం యుద్ధ విమాన ఇంజిన్ అభివృద్ధికే పరిమితం కాకుండా భవిష్యత్తులో రక్షణ రంగం, పౌర విమానయానం, విద్యుత్, ప్రొపల్షన్ వ్యవస్థల్లోనూ విస్తృత భాగస్వామ్యాలకు దారితీసే అవకాశం ఉందని సంస్థలు తెలిపాయి.

**భారత్‌లో గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్**

భారత్‌లో ప్రత్యేకంగా ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రెండు సంస్థలు వెల్లడించాయి. దీనిని పవర్, ప్రొపల్షన్ సాంకేతికతలో అత్యున్నత నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాయి. యుద్ధ విమాన ఇంజిన్లకు అవసరమైన కీలక కార్యకలాపాలను ఒకే చోట నిర్వహించేలా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇంజిన్ల రూపకల్పన, అభివృద్ధి, తయారీ, ఉత్పత్తి, పరీక్షలు, నిర్వహణ వంటి కార్యకలాపాలను దేశీయంగానే చేపట్టే సామర్థ్యాన్ని ఈ కేంద్రం ద్వారా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించాయి. రక్షణ రంగంలో విదేశీ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు అత్యాధునిక సాంకేతికతలో దేశీయ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని సంస్థలు పేర్కొన్నాయి.

**వ్యూహాత్మక సార్వభౌమత్వమే లక్ష్యం**

భారత్ వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని సాధించాలంటే అత్యంత క్లిష్టమైన సాంకేతికతల్లో సొంత సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అనంత్ అంబానీ తెలిపారు. రోల్స్ రాయిస్ ఇంజిన్ సాంకేతిక నైపుణ్యాన్ని, రిలయన్స్ ఉత్పాదకత, సాంకేతిక సామర్థ్యం, భారీ స్థాయిలో ప్రాజెక్టులను అమలు చేసే శక్తితో అనుసంధానించడం ద్వారా దేశీయంగా బలమైన ఏరో ఇంజిన్ వ్యవస్థను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ భాగస్వామ్యం అనుగుణంగా ఉంటుందని సంస్థలు తెలిపాయి. భవిష్యత్తులో దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే స్థాయిలో సాంకేతిక సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేర్కొన్నాయి.

**ఇంకా తుది ఒప్పందం కాదు**

ప్రస్తుతానికి రిలయన్స్, రోల్స్ రాయిస్ సంస్థలు తమ వ్యూహాత్మక ఉద్దేశాన్ని మాత్రమే ప్రకటించాయి. ఇది ఇంకా పూర్తి స్థాయి సంయుక్త సంస్థగా లేదా అధికారిక కాంట్రాక్టుగా మారలేదు. ప్రతిపాదిత ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటు దిశగా తొలి అడుగుగా దీన్ని భావిస్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడి మొత్తం, అమలు కాలపరిమితి, ఇరు సంస్థల వాటాల వివరాలను మాత్రం ప్రస్తుతానికి వెల్లడించలేదు. ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణం, సాంకేతిక భాగస్వామ్యం, ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ భారత్ స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్టు. శత్రు రాడార్లకు చిక్కకుండా దాడులు నిర్వహించగల సామర్థ్యంతో పాటు అత్యాధునిక సాంకేతికతను ఇందులో వినియోగించనున్నారు. ఈ విమానానికి అవసరమైన ఇంజిన్ సాంకేతికతలో దేశీయ సామర్థ్యాన్ని పెంచే దిశగా రిలయన్స్, రోల్స్ రాయిస్ భాగస్వామ్యం కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# భూముల కబ్జా వెనుక రేవంత్ రెడ్డి హస్తం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన 1000 ఎకరాల అత్యంత విలువైన భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అనుచరులు, రెవెన్యూ అధికారులను అడ్డుపెట్టుకొని ఈ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

**2007లో రైతులవేనని ధ్రువీకరణ**

2007లో అప్పటి కలెక్టర్ ముద్దడ రవిచంద్ర ఈ భూములు రైతులవేనని అధికారికంగా ధ్రువీకరించినప్పటికీ, ఇప్పుడు మళ్లీ ఆర్డీవో రైతులకు నోటీసులు ఎందుకు పంపుతున్నారని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఎవరి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ధోరణిలో లోపాలున్నాయంటూ భూభారతి పోర్టల్ తీసుకొచ్చి, కార్యాలయాన్ని ఎన్ఐసీలో పెట్టి, ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా రెవెన్యూ మంత్రి తన వద్దే అన్ని అధికారాలను కేంద్రీకరించుకున్నారని ఆయన ఆరోపించారు. చిన్నచిన్న మార్పులు చేయాలన్నా రెవెన్యూ మంత్రి అనుమతి తప్పనిసరి చేశారని అన్నారు. ఈ కారణంగానే సుమారు 22 వేల ఫైళ్లలో చట్టవిరుద్ధంగా రికార్డులు మార్చారని, రెవెన్యూ అధికారులు, కలెక్టర్ అనుమతి లేకుండానే ఈ మార్పులు జరిగాయని ఆరోపించారు.

**విలువైన భూములపై అనుచరుల కన్ను**

పట్టినాగులపల్లి, కోకాపేట, మోకిల, యాచారం, బొమ్మరాసిపేట ప్రాంతాల్లోని విలువైన భూములపై ఆక్రమణలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అంజిరెడ్డి, అనిల్ రెడ్డి, ఉదయ సింహా రెడ్డి, ఎ.వి రెడ్డి, వజ్రేష్ యాదవ్ వంటి వ్యక్తులను పంపి రైతులను బెదిరించడం, నకిలీ పత్రాలు సృష్టించడం, అధికారులపై అక్రమ ఆదేశాలు జారీ చేయడం ద్వారా భూముల కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. వజ్రేష్ యాదవ్, ఉదయ సింహా రెడ్డి, అనిల్ రెడ్డి, అంజి రెడ్డి, ఎ.వి రెడ్డి ఎవరో, వారికి సచివాలయంలో ఏం పని ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత లగచర్ల భూముల విషయంలోనూ రైతుల భూములను ఆక్రమించుకునే ప్రయత్నాలను బీఆర్‌ఎస్ అడ్డుకుందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు బొమ్మరాసిపేట రైతుల భూములను రక్షించాలని, వారికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని తెలిపారు. ఇప్పుడు అదే రైతుల భూముల విషయంలో ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

**రైతుల వెంట బీఆర్‌ఎస్**

భూములను రక్షించుకునేందుకు పోరాడుతున్న రైతులను లగచర్ల రైతుల మాదిరిగా జైలుకు పంపే ప్రయత్నం చేస్తే వారితో పాటు తామూ జైలుకు వెళ్తామని ప్రవీణ్ కుమార్ అన్నారు. రైతులు చందాలు వేసుకొని పత్రికలకు ప్రకటనలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని, రైతుల పోరాటాలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోంశాఖతో పాటు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖలను తన వద్దే ఉంచుకున్నారని, తన మిత్రుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రెవెన్యూ శాఖతో పాటు సమాచార పౌరసంబంధాల శాఖ బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. భూ దందాలు బయటకు రాకుండా మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికారులపై అక్రమ ఒత్తిళ్లు తెచ్చి చట్టవిరుద్ధమైన పనులు చేయిస్తే భవిష్యత్తులో చర్లపల్లి జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో అధికారులపై చర్యలు తీసుకునే వరకు పోరాడుతామని తెలిపారు. అవసరమైతే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని, హైకోర్టులో మరోసారి కేసు వేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తామని డా. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.



# చదువుతోనే తలరాత మారుతుంది



(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. చదువే ఆయుధంగా మారుతుందని జ్యోతిబా ఫులే గుర్తించారని, అదే స్ఫూర్తితో విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

**యంగ్ ఇండియా పాఠశాలలతో మార్పు**

విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని సీఎం తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందించడంపై దృష్టి సారిస్తున్నామని వివరించారు. కృత్రిమ మేధ కారణంగా నిపుణుల ఉద్యోగాలకు సైతం ముప్పు ఏర్పడుతున్న పరిస్థితుల్లో యువతకు భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికి ప్రపంచవ్యాప్తంగా రెడ్ కార్పెట్ స్వాగతం లభిస్తోందని, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థులకు అలాంటి నైపుణ్యాలు అందించి, అవసరమైతే ఆయా దేశాలకు పంపించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ నెలలోనే**

ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఏడాదికి రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందుగానే క్రెడిట్ చేస్తున్నామని చెప్పారు. ఈ విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తున్నామని, కళాశాలలో ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జనగణనలో భాగంగా బలహీన వర్గాల లెక్కలు తేల్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ముఖ్యమంత్రి చెప్పారు. ఏడాదిలోనే లెక్కలు తేల్చి ఫిబ్రవరి నాలుగో తేదీని సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కొందరు కులగణన, జనగణన ప్రక్రియలో భాగస్వామ్యం కాకుండా కోర్టును ఆశ్రయించారని, అసెంబ్లీలో వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ చట్టపరంగా కమిషన్ ఏర్పాటు చేసి లెక్కలు తేల్చామని వివరించారు. జనాభా లెక్కలు తేల్చాలంటే కులగణన చేయక తప్పని పరిస్థితి ఉందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన వంటి అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**పతకాలు సాధిస్తే ఉద్యోగాలు**

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఎం పిలుపునిచ్చారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు నజరానాలు అందిస్తామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపే యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. విద్యార్థులు చదువులు, క్రీడలు, పరిపాలన వంటి రంగాల్లో రాణించాలని సూచించారు. పారదర్శక పాలన అందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# సన్నవడ్లకు రూ.500 బోనస్



**డిసెంబరు 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ సదస్సు**
**రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
**మిగులు ధాన్యానికి క్వింటాకు రూ.2,389 కనీస ధర**
**ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి**
**ఆటోలకు ఈవీలుగా మారేందుకు రూ.200 కోట్ల పథకం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

కాకతీయ,తెలంగాణ బ్యూరో : వానాకాలంలో ఏడు రకాల సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకు ఈ ఏడాది నుంచి ఆ రకాల ధాన్యానికే క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల్లో అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. మిగులు ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో విడత నిర్వహణ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, సన్నవడ్లకు బోనస్, మిగులు ధాన్యం విక్రయం, విద్యా సంస్థల పరిధిలో మార్పులు, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీ తదితర కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

### డిసెంబరులో తెలంగాణ రైజింగ్ సదస్సు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో విడతను డిసెంబరు 7, 8, 9 తేదీల్లో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనుంది. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించిన తరహాలో ఈసారి పెట్టుబడులే ప్రధాన అంశంగా సదస్సు నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్రణాళికను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు. రక్షణ, ఏరోస్పేస్, ఔషధ రంగాల్లో తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనున్నారు.

### రేపటి నుంచి స్మార్ట్ కార్డులు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసి మరో 62 లక్షల మందికి ప్రయోజనం కల్పించామని పొంగులేటి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ స్మార్ట్ కార్డులు జారీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.

### మిగులు ధాన్యం ఈ వేలం

కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్నను వేలం వేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరిన నేపథ్యంలో మిగులు ధాన్యాన్ని కూడా అదే విధానంలో విక్రయించాలని నిర్ణయించింది. ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389 కనీస ధరను నిర్ణయించి ఈ వేలం నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్న ఈ సంస్థలను తెలంగాణ విద్యా చట్టం పరిధి నుంచి తొలగించి స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చాలని నిర్ణయించింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్సులను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర శిక్షణ అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

### ఆటోలకు రూ.200 కోట్ల పథకం

రాష్ట్రంలో 18,766 పెట్రోలు, డీజిల్ ఆటోరిక్షాలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నారు. దీంతో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో డ్రైవర్ల నిర్వహణ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువును మరో మూడు వారాలు పొడిగించాలని కేబినెట్ నిర్ణయించింది. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు రూ.2,100 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. వివిధ రంగాల్లో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుపై మోదీ ఫొటో ఏదీ?



- కేంద్రం వాటాను రాష్ట్రం గుర్తించదా
- 6 కిలోల్లో 5 కిలోలు కేంద్రానివే
- కొత్త కార్డుల లెక్కలు వెల్లడించాలి
- ముద్రణ ఖర్చు, టెండర్ల వివరాలు చెప్పాలి
- రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : తెలంగాణలో పంపిణీ చేయనున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఎందుకు ముద్రించడం లేదని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఒక్కో లబ్ధిదారుడికి అందుతున్న 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నవేనని తెలిపారు. కేంద్రం అందిస్తున్న ప్రయోజనానికి గుర్తింపుగా ప్రధాని మోదీ ఫొటోను స్మార్ట్ రేషన్ కార్డుపై ముద్రించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ముద్రించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఫొటోల అంశం రాజకీయంగా వివాదానికి దారితీసింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యంలో తన వాటాను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని రఘునందన్ రావు ఆరోపించారు. కేంద్రం అందిస్తున్న ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతప్రభుత్వంపై ఉందన్నారు.

### కొత్త కార్డుల లెక్కలు చెప్పాలి

రాష్ట్రంలో కొత్తగా పంపిణీ చేయనున్న రేషన్ కార్డుల సంఖ్యపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, 1.06 కోట్ల కార్డుల పంపిణీపై ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు. ఎన్ని కొత్త కార్డులు మంజూరు చేశారు, ఎంతమందికి పంపిణీ చేయనున్నారు అనే వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణకు ఎంత ఖర్చవుతోంది, టెండర్లు ఎవరికి దక్కాయి, ప్రభుత్వం ఎంత మొత్తాన్ని వెచ్చిస్తోంది వంటి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు.

### డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలోని రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రఘునందన్ రావు కోరారు. డీలర్లకు గౌరవ వేతనం, పెంచిన కమిషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యంలో నూకలు ఎక్కువగా ఉంటున్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించి, పేదలకు నాణ్యమైన బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చౌక ధరల దుకాణాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే కాకుండా కందిపప్పు, వంటనూనె, రాగులు, చక్కెర, గోధుమలు వంటి నిత్యావసర సరుకులను కూడా అందించాలని కోరారు. బియ్యం అవసరం లేని కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలను అందించే విధానాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.

### మోదీ ఫొటోపై ఉద్యమం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యంలో తన వాటాను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని రఘునందన్ రావు అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించాలన్న తన డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, రేషన్ కార్డుల సంఖ్య, ముద్రణ ఖర్చులు వంటి అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# నీటి లెక్కలు తేల్చాలి!

- ప్రాజెక్టులు.. చెరువులున్నా సాగుకు భరోసా ఏదీ?
- ఇన్‌ఫ్లో.. అవుట్‌ఫ్లోపై భూపాలపల్లి కలెక్టర్ ఆరా
- ఆయకట్టుకు ఎంత.. తాగునీటికి ఎంత?
- సాగు ప్రణాళికకు అడ్వైజరీ బోర్డు కసరత్తు
- నీటి లభ్యతపై సమగ్ర నివేదికకు ఆదేశం



గత బుధవారం అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాహుల్ శర్మ

కాకతీయ, భూపాలపల్లి: గోదావరి పరవళ్లు తొక్కే జిల్లా.. భారీ సాగునీటి ప్రాజెక్టులు.. వందలాది చెరువులు.. అయినా రైతుకు సాగునీటి భరోసా విషయంలో ఏటా లెక్కలు తేల్చుకోవాల్సిన పరిస్థితి. ఎక్కడ ఎంత నీరు ఉంది? ఎంత వస్తోంది? ఎంత విడుదలవుతోంది? ఆయకట్టుకు ఎంత అవసరం? తాగునీటికి ఎంత కేటాయించాలి? అన్నదానిపై స్పష్టత ఉంటేనే పంటల సాగుకు ముందస్తు ప్రణాళిక సాధ్యమవుతుంది. జిల్లా యంత్రాంగం నీటి వనరులపై సమగ్ర లెక్కలు సిద్ధం చేయడంపై దృష్టి సారించింది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ చెరువుల నీటి నిల్వలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.

### చెరువులెన్నో.. నీరెంత?

భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోనే 618 చెరువులు, 55,301 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు గత ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో చిన్ననీటి వనరుల విస్తృతి కూడా గణనీయమే. అయితే చెరువుల సంఖ్య కంటే వాటిలో ప్రస్తుతం ఎంత నీరు నిల్వ ఉంది? పూర్తి సామర్థ్యంతో ఎన్ని నిండుతున్నాయి? ఆయకట్టుకు వాస్తవంగా ఎంత నీరు అందుతోంది? అన్నదే కీలకం. గతంలో కూడా జిల్లాలో గోదావరి అందుబాటులో ఉన్నా కొన్ని ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా చేరకపోవడంపై విమర్శలు వచ్చాయి. దేవాదుల, కాళేశ్వరం తదితర సాగునీటి వ్యవస్థలతో పాటు పెద్ద చెరువులు జిల్లాకు ప్రధాన నీటి ఆధారాలు. కానీ ప్రాజెక్టులో నీరు ఉండటం వేరు.. అది అవసరమైన సమయంలో ఆయకట్టుకు చేరడం వేరు. అందుకే ప్రస్తుత నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ప్రాజెక్టుల వారీగా సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

### సాగుకు ఎంత.. తాగునీటికి ఎంత?

ఒకవైపు రైతుల సాగునీటి అవసరాలు.. మరోవైపు గ్రామాలు, పట్టణాలకు తాగునీటి అవసరాలు. రెండింటికీ నీటి లభ్యతను ముందుగానే లెక్కించాల్సి ఉంది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటిని ఏ అవసరానికి ఎంత వినియోగించాలన్నదానిపై స్పష్టమైన ప్రణాళిక లేకపోతే అవసరమైన సమయంలో ఇబ్బందులు తప్పవు. అందుకే ఆయకట్టు విస్తీర్ణం, పంటల అవసరం, తాగునీటి అవసరం అన్నింటినీ కలిపి నివేదిక రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో చిన్న కాళేశ్వరం వంటి పథకాల ద్వారా గోదావరి నీటిని చెరువులకు మళ్లించి సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే కొన్ని ప్రాజెక్టులు, కాలువల పనులు పూర్తికాకపోవడం వల్ల ఆశించిన ప్రయోజనం అందకపోతున్న ప్రాంతాలున్నాయి..

### అడ్వైజరీ బోర్డులో నిర్ణయాలు

నీటి లభ్యత, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న నీటికి అనుగుణంగా పంటల సాగుపై రైతులకు మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నిల్వలు, చెరువుల పరిస్థితి, ఇన్‌ఫ్లో–అవుట్‌ఫ్లో, ఆయకట్టు అవసరాలన్నీ ఒకచోటకు వస్తేనే జిల్లాకు వాస్తవిక నీటి బడ్జెట్ సిద్ధమవుతుంది. ఈసారి ఆ లెక్కల ఆధారంగానే సాగు ప్రణాళిక రూపొందిస్తే.. నీటి వనరులు ఉన్నా ప్రతి ఏటా ఎదురయ్యే సాగునీటి అనిశ్చితికి కొంతైనాతెరపడే అవకాశం ఉంది.

# గంజాయి డెడ్‌డ్రాప్.. చీకటి దందా!

- 203 మంది కస్టమర్లకు గంజాయి సరఫరా
- గంజాయి సొమ్ముతో అమ్మాయిలను హైదరాబాద్‌కు రప్పించిన కిరణ్
- వరంగల్ సహా మారుమూల ప్రాంతాల నుంచి తరలింపు
- మైనర్ బాలికలపైనా లైంగిక దాడుల కేసు
- గర్భం దాల్చిన వారిపై దాడులు.. అబార్షన్లు



కాకతీయ, తెలంగాణ బ్యూరో : గంజాయి విక్రయాల కోసం 'డెడ్‌డ్రాప్' పద్ధతిని ఎంచుకున్న బొల్లా సోదరుల వ్యవహారం దర్యాప్తులో విస్తుగొలిపే మలుపులు తిరుగుతోంది. కస్టమర్లకు నేరుగా గంజాయి ఇవ్వకుండా.. ముందుగా నిర్ణయించిన ప్రాంతాల్లో ప్యాకెట్లు ఉంచి సరఫరా చేసిన ఈ నెట్‌వర్క్ ద్వారా 203 మంది కస్టమర్లకు గంజాయి చేరినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ దందా ద్వారా వచ్చిన డబ్బును బొల్లా కిరణ్ అమ్మాయిలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి వినియోగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. వరంగల్ సహా మారుమూల ప్రాంతాల నుంచి అమ్మాయిలను నగరానికి రప్పించి తన ఆధీనంలో ఉంచుకున్నట్లు తెలుస్తోంది. వారిపై లైంగిక దాడులకు పాల్పడినట్లు, మైనర్ బాలికల విషయంలోనూ పోక్సో చట్టం కింద చర్యలకు దారితీసే అంశాలు బయటపడినట్లు సమాచారం. బొల్లా సోదరులు గంజాయి సరఫరాకు సాధారణ డెలివరీ విధానాన్ని కాకుండా 'డెడ్‌డ్రాప్' పద్ధతిని ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. కస్టమర్‌తో నేరుగా కలవకుండా ఒక నిర్దిష్ట ప్రదేశంలో గంజాయి ప్యాకెట్‌ను ఉంచి.. ఆ ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని చేరవేసి సరుకు తీసుకునేలా వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. మొబైల్ ఫోన్లు, డిజిటల్ లావాదేవీలు, కస్టమర్లతో జరిగిన సంభాషణలను పరిశీలించడంతో ఈ నెట్‌వర్క్ విస్తృతి బయటపడినట్లు సమాచారం. ఇప్పటివరకు 203 మంది కస్టమర్ల వివరాలు దర్యాప్తు బృందాల పరిశీలనలోకి వచ్చినట్లు తెలుస్తోంది. వీరిలో ఎవరెవరు తరచూ గంజాయి కొనుగోలు చేశారు? ఎంత మొత్తంలో లావాదేవీలు జరిగాయి? గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది? సరఫరాలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? అన్న కోణాల్లో దర్యాప్తు సాగుతోంది.

### గంజాయి డబ్బు.. అమ్మాయిల కోసం?

గంజాయి విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును కిరణ్ అమ్మాయిలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి వినియోగించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. వరంగల్ సహా మారుమూల ప్రాంతాల నుంచి అమ్మాయిలను హైదరాబాద్‌కు రప్పించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. నగరానికి వచ్చిన తర్వాత వారిని తన ఆధీనంలో ఉంచుకుని లైంగిక వేధింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అమ్మాయిలను ఎవరు గుర్తించారు? వారిని హైదరాబాద్‌కు ఎవరు తీసుకొచ్చారు? నగరంలో ఎక్కడ ఉంచారు? వారి ఖర్చులను ఎవరు భరించారు? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి దందా ద్వారా వచ్చిన ఆదాయం ఈ వ్యవహారానికి ఎలా వినియోగమైందన్నదానిపైనా దృష్టి సారించినట్లు సమాచారం.

### మైనర్లపై లైంగిక దాడులు

కేసు దర్యాప్తులో బయటకొచ్చిన అత్యంత తీవ్రమైన అంశం మైనర్ బాలికలపై లైంగిక దాడుల వ్యవహారం. బాధితుల్లో మైనర్లు ఉన్నట్లు గుర్తించడంతో పోలీసులు పోక్సో కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల వాంగ్మూలాలతో పాటు వైద్య రికార్డులు, ఫోన్ డేటా, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొంతమంది బాధితులు గర్భం దాల్చిన సందర్భాల్లో వారిపై దాడులు చేసి అబార్షన్లు చేయించినట్లు కూడా దర్యాప్తులో ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ అంశంలో వైద్య ఆధారాలు కీలకంగా మారనున్నాయి. బాధితులకు ఎక్కడ వైద్యం అందించారు? ఎవరి సహకారంతో అబార్షన్లు జరిగాయి? అన్నదానిపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు గంజాయి సరఫరా కేసుగా సాగిన దర్యాప్తు.. తాజా పరిణామాలతో అమ్మాయిల తరలింపు, లైంగిక దాడులు, మైనర్లపై నేరాలు వంటి తీవ్ర అంశాల దిశగా మళ్లింది. గంజాయి విక్రయాల ద్వారా వచ్చిన డబ్బు నుంచి అమ్మాయిల వ్యవహారం వరకు ప్రతి లింకును పోలీసులు కలుపుతున్నట్లు తెలుస్తోంది. 203 మంది కస్టమర్లు.. వారి లావాదేవీలు.. గంజాయి సరఫరా మార్గాలు.. అమ్మాయిలను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన వ్యవస్థ.. మైనర్ బాధితుల వివరాలు ఇలా ప్రతి అంశాన్ని విడివిడిగా పరిశీలిస్తేనే ఈ దందా అసలు స్వరూపం బయటపడనుంది. ముఖ్యంగా కిరణ్‌కు సహకరించిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? అమ్మాయిలను తరలించడంలో మధ్యవర్తుల పాత్ర ఎంత? గంజాయి డబ్బు ఏ మార్గంలో ఖర్చయింది? అన్న ప్రశ్నలకు సమాధానాల కోసం దర్యాప్తు కీలక దశకు చేరినట్లు సమాచారం.

# కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు

**రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పనిచేస్తా**
**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

కాకతీయ, హైదరాబాద్ : తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీని వీడుతున్నానంటూ జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న కొన్ని పరిణామాలపై తన అభిప్రాయాలను మాత్రమే వెల్లడిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులను తాను విమర్శించలేదని, ఇకపై కూడా వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించబోనని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొందరి ఆధిపత్యం పెరుగుతోందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. దీంతో పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని వీడే ఉద్దేశం తనకు లేదని, కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ బలోపేతం, కార్యకర్తల సమస్యలపై తన అభిప్రాయాలను మాత్రమే చెబుతున్నానని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. వ్యక్తిగత విమర్శలకు తాను దూరంగా ఉంటానని స్పష్టం చేశారు.

## మెడికవర్‌లో వైద్యం కంటే బిల్లులకే ప్రాధాన్యమా?

**అత్యవసరమంటూ అడ్వాన్స్.. గంటల తరబడి నిరీక్షణ**
**పరీక్షలు, మందులు, వార్డు చార్జీలతో బిల్లు మోత**
**ఆసుపత్రి తీరుపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

కాకతీయ, వరంగల్ : అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన రోగికి వెంటనే వైద్యం అందించాల్సింది పోయి.. ముందుగా డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడం, ఆ తర్వాత గంటల తరబడి వైద్య సేవల కోసం నిరీక్షింపజేయడం.. పరీక్షలు, మందులు, వార్డు, వైద్యుల కన్సల్టేషన్, పరికరాలు, ఆహారం పేరుతో వరుసగా చార్జీలు వేయడం.. చివరకు వేల రూపాయల బిల్లును చేతిలో పెట్టడం.. వరంగల్ మెడికవర్ ఆసుపత్రి తీరుపై బాధిత కుటుంబం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. రోగిని ఆసుపత్రిలో చేర్చిన సమయంలో రూ.20 వేల అడ్వాన్స్ తీసుకున్నట్లు రసీదు స్పష్టం చేస్తోంది. అనంతరం వివిధ వైద్య సేవలకు చార్జీలు జోడించి మొత్తం బిల్లును రూ.23,383గా చూపించారు. ఇప్పటికే చెల్లించిన రూ.20 వేలుపోగా మరో రూ.3,383 బకాయిగా పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన కుటుంబ సభ్యులకు ముందుగానే చికిత్సకు అయ్యే ఖర్చు, చేయాల్సిన పరీక్షలు, వాటి అవసరం, అంచనా వ్యయం వంటి వివరాలను స్పష్టంగా చెప్పారా? అన్నది ప్రశ్న. బాధితుల ఆరోపణల ప్రకారం మధ్యాహ్నం ఆసుపత్రిలో చేర్చిన తర్వాత కూడా రాత్రి వరకు వైద్య సేవల కోసం నిరీక్షించాల్సి వచ్చింది.

### పరీక్షల పేరుతో.. బిల్లుల పరంపర

బాధితుల వద్ద ఉన్న బిల్లులో హెచ్‌బీఏ1సీ, సీరమ్ కాల్షియం, సీబీపీ, మూత్ర పరీక్ష, అల్ట్రాసౌండ్, ఎంఆర్‌ఐ, ఈసీజీ తదితర పరీక్షలకు చార్జీలు నమోదయ్యాయి. ఎంఆర్‌ఐకి రూ.7,700, అల్ట్రాసౌండ్‌కు రూ.1,320, హెచ్‌బీఏ1సీకి రూ.910, ఈసీజీకి రూ.280గా రుసుములు ఉన్నాయి. ఫార్మసీ విభాగంలో మందులు, ఇంజెక్షన్లు, సిరింజ్‌లు, ఐవీ సెట్లు తదితరాలకు కూడా ప్రత్యేకంగా చార్జీలు వేశారు. వార్డు, నర్సింగ్, డ్యూటీ డాక్టర్, కన్సల్టేషన్, ఇన్ఫ్యూషన్ పంప్ వంటి సేవలకూ బిల్లులు జతయ్యాయి. అయితే ప్రశ్న బిల్లులో మొత్తాలుండటంపై మాత్రమే కాదు. చేసిన ప్రతి పరీక్ష ఎందుకు అవసరమైంది? రోగి కుటుంబానికి వైద్యులు ఏమి వివరించారు? అన్నదానిపై స్పష్టత ఉండాలి.

### ఉప్మాకు రూ.750.. ఇదేం లెక్క?

బిల్లులో ఫుడ్ చార్జీగా రూ.750 నమోదై ఉండటం కూడా బాధితులను విస్మయానికి గురిచేసింది. రోగికి అందించిన ఆహారం ఏమిటి? ఎన్ని సార్లు ఇచ్చారు? ఒక్కోసారి ఎంత చార్జీ? అన్న వివరాలు లేకుండానే మొత్తం రూ.750గా చూపడంపై కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే బిల్లులో జనరల్ వార్డు రూ.2,500, నర్సింగ్ రూ.1,000, ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టేషన్ రూ.1,200, డ్యూటీ డాక్టర్ రూ.1,000, ఇన్ఫ్యూషన్ పంప్ రూ.650 వంటి చార్జీలు కూడా ఉన్నాయి. మొత్తంగా రూ.23,383 బిల్లు వచ్చినా.. రోగికి అందిన వైద్య సేవలపై కుటుంబ సభ్యులకు పూర్తి స్థాయిలో స్పష్టత వచ్చిందా అన్నదే అసలు ప్రశ్న. వైద్యం కొనసాగించకుండా వెళ్లిపోవాలని భావించిన సమయంలోనూ బిల్లులు, చెల్లింపుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు.

# జర్నలిజం ఎంతో పవిత్రమైనది

- ప్రజల పక్షాన నిలిచి వార్తలు రాయాలి
- డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి
- నడికూడలో నూతన ప్రెస్‌క్లబ్ ప్రారంభం



కాకతీయ, పరకాల : ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో, సమాజ శ్రేయస్సు ను కాపాడటంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. జర్నలిజం ఎంతో పవిత్రమైనదని, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు నిష్పక్షపాతంగా ప్రజల పక్షాన నిలిచి వార్తలు రాయాలని సూచించారు. నడికుడ మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్‌హాల్‌లో నూతన ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నడికుడ మండలంలోని జర్నలిస్టులంతా ఒకే తాటిపైకి వచ్చి ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజానికి మేలు జరిగేలా పాత్రికేయులు పనిచేయాలని కోరారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చల్లా ధర్మారెడ్డి పరామర్శ

కాకతీయ, గీసుగొండ : ఇటీవల కాలంలో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు,నాయకుల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. వరంగల్ మహా నగరపాలక సంస్థ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పిట్టల రాజు తల్లి ఆగమ్మ, బొడ్డు చింతలపల్లికి చెందిన మాదాసి కనకయ్య, కునమల్ల సమ్మక్క, కాటి రాణి కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన చల్లా ధర్మారెడ్డి.. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అదేవిధంగా ఊకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు డోలే రవి ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి ఆయనను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# రూల్స్ కాగితాలకే పరిమితం




- 32 ఏళ్లుగా అమలుకు నోచుకోని విద్యాశాఖ నిబంధనలు
- ఉమ్మడి జిల్లాలో 900 ప్రైవేటు పాఠశాలలు
- ఫీజుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిందే
- వెబ్‌సైట్‌లో ఒక రేటు.. వసూళ్లలో మరో రేటా?
- రసీదుల్లో ఎంత.. వాస్తవంగా చెల్లించేది ఎంత?

కాకతీయ, నిఘాప్రతినిధి : ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్లకు నిబంధనలు ఉన్నాయి.. పాఠశాలలు వసూలు చేసే ఫీజుల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాల్సిన విధానం ఉంది. ఫీజులపై పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులదే. అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారడం లేదు. ఏటా పాఠశాలల ప్రారంభ సమయంలో ఫీజుల వ్యవహారం తెరపైకి వస్తూనే ఉంది. తల్లిదండ్రులపై ఫీజుల భారం పెరుగుతూనే ఉంది. నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారా? పాఠశాలలు నిబంధనలను పాటిస్తున్నాయా? అన్నదే ప్రశ్న. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 900 ప్రైవేటు పాఠశాలలు ఉండటంతో ఈ వ్యవహారంపై పర్యవేక్షణ మరింత కీలకంగా మారింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 1994లోనే జీవో జారీ చేసింది. పాఠశాలలు వసూలు చేసే ఫీజుల వివరాలను విద్యాశాఖకు తెలియజేయాలన్నది ఇందులోని ప్రధాన ఉద్దేశం. ఫీజుల విషయంలో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా.. వసూలు చేస్తున్న మొత్తాలపై ప్రభుత్వానికి సమాచారం ఉండేలా ఈ విధానాన్ని రూపొందించారు. అయితే జీవో వచ్చి 32 ఏళ్లు గడిచినా.. దాని అమలు మాత్రం ఆశించిన స్థాయిలో లేదన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనలు ఉన్నా వాటి అమలును నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ బలహీనంగా ఉండటంతో సమస్య యథాతథంగా కొనసాగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### 900 బడులపై నిఘా ఏదీ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల్లో మొత్తం 900 ప్రైవేటు పాఠశాలలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో హనుమకొండ జిల్లాలో 333, వరంగల్ జిల్లాలో 261, మహబూబాబాద్‌లో 115, జనగామలో 82, భూపాలపల్లిలో 69, ములుగులో 40 పాఠశాలలు ఉన్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉన్నప్పుడు వాటిలో ఫీజుల వసూళ్లపై విద్యాశాఖ ఎంతమేరకు నిఘా పెడుతోందన్నది చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలు నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేస్తున్నాయా? వివరాలను నమోదు చేస్తున్నాయా? తల్లిదండ్రులకు పూర్తి సమాచారం ఇస్తున్నాయా? అన్న అంశాలపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే ఫిర్యాదు వచ్చినప్పుడు స్పందించడం కాకుండా.. ముందుగానే పర్యవేక్షించే విధానం ఎంతవరకు అమలవుతోందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### వెబ్‌సైట్‌లో నమోదు తప్పనిసరి

ఫీజుల వసూళ్లలో పారదర్శకత కోసం పాఠశాలలు ఫీజుల వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఏ పాఠశాల ఎంత ఫీజు వసూలు చేస్తోంది? ఏ తరగతికి ఎంత ఫీజు నిర్ణయించింది? అనే వివరాలు అందుబాటులో ఉండేలా చేయడమే దీని ఉద్దేశం. దీనివల్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు చదువుతున్న పాఠశాల ఫీజుల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ వివరాలు వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నాయా? పాఠశాలలు వెబ్‌సైట్‌లో ఫీజుల వివరాలు నమోదు చేస్తున్నాయా? నమోదు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నాయా? అన్నది పరిశీలించాల్సి ఉంది. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడం ఒక ప్రక్రియగా మిగిలిపోకుండా.. వాటి ఆధారంగానే వసూళ్లు జరుగుతున్నాయా లేదా అన్నది అధికారులు నిర్ధారించాల్సి ఉంది.

### వెబ్‌సైట్‌లో ఒకటి.. వసూళ్లలో మరొకటి?

ఇదే ఇప్పుడు అసలు పరిశీలించాల్సిన అంశం. పాఠశాలలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసిన ఫీజులనే విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయా? లేక అదనంగా మరేదైనా మొత్తాన్ని తీసుకుంటున్నాయా? అన్నది తేలాల్సి ఉంది. వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఫీజుకు, తల్లిదండ్రులు చెల్లిస్తున్న మొత్తానికి తేడా ఉంటే.. ఆ అదనపు మొత్తం ఏ పేరుతో వసూలు చేస్తున్నారన్నది ప్రశ్న. ఫీజులతో పాటు ఇతర చార్జీలు ఏమైనా ఉంటే వాటి వివరాలు కూడా పారదర్శకంగా వెల్లడించాల్సి ఉంటుంది. వెబ్‌సైట్‌లో ఒక మొత్తం చూపిస్తూ.. వాస్తవంగా మరో మొత్తం వసూలు చేస్తున్నట్లయితే నిబంధనల ఉద్దేశమే నీరుగారిపోతుంది. అందుకే కేవలం వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేశారా లేదా అన్నది కాకుండా.. అందులో నమోదైన మొత్తాన్నే వసూలు చేస్తున్నారా లేదా అన్నదానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

### రసీదులే అసలు ఆధారం

ఫీజుల వసూళ్లలో తల్లిదండ్రులకు ఇచ్చే రసీదులు కీలక ఆధారాలు. పాఠశాలలు వసూలు చేస్తున్న మొత్తానికి రసీదు ఇస్తున్నాయా? అందులో ఫీజు వివరాలను స్పష్టంగా నమోదు చేస్తున్నాయా? వెబ్‌సైట్‌లో పేర్కొన్న మొత్తానికీ రసీదులో చూపిన మొత్తానికీ పొంతన ఉందా? అన్నది పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది. ఒకవైపు ప్రభుత్వ వెబ్‌సైట్.. మరోవైపు పాఠశాల రసీదులు.. ఇంకోవైపు తల్లిదండ్రులు వాస్తవంగా చెల్లించిన మొత్తం.. ఈ మూడింటినీ సరిపోల్చితేనే ఫీజుల వ్యవహారంలో పారదర్శకత ఎంతవరకు ఉందో తెలుస్తుంది. 32 ఏళ్ల క్రితం రూపొందించిన నిబంధనలు ఇప్పటికీ అమలు కావాల్సిన అవసరం ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. నిబంధనలు పెట్టడంతోనే సరిపెట్టకుండా.. 900 ప్రైవేటు పాఠశాలల్లో అవి అమలవుతున్నాయా లేదా అన్నది విద్యాశాఖ పర్యవేక్షించాలి. ఫీజుల వివరాలు, వెబ్‌సైట్ నమోదు, రసీదులు, వాస్తవ వసూళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తేనే నిబంధనలకు సార్థకత చేకూరుతుంది.

# రేషన్ బస్తాల్లో నూకల మయం







- పేదోడి బియ్యంపట్టింపు లేదా?
- వరంగల్, ఖిలా వరంగల్‌లో నాణ్యతలేని బియ్యం పంపిణీ
- 50.650 కిలోలకు బదులు 45 కిలోలు
- లెక్కలు సరిపోక డీలర్లు, ప్రజలు ఇద్దరూ నష్టంలో

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : "ఉచితం కదా అని ఏది పడితే అది ఇస్తారా?" అంటూ వరంగల్, ఖిలా వరంగల్ మండలాల ప్రజలు ప్రభుత్వంపై, సివిల్ సప్లై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో నాణ్యత కనిపించడం లేదు. చల్లగోదాముల నుంచి వస్తున్న బస్తాలు తెరిస్తే బియ్యానికి బదులు సగానికి సగం నూకలు కనిపిస్తున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం పంపిణీపై పర్యవేక్షణ ఉందని, ప్రతి బస్తాను పరిశీలించే సప్లై చేస్తున్నామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది.

### చల్లగోదాము నుంచి నేరుగా నూకలా?

గత కొంతకాలంగా రేషన్ డీలర్లకు సరఫరా అవుతున్న బస్తాల్లో నాణ్యత తీవ్రంగా పడిపోయిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బస్తా విప్పగానే ధూళిలా నూకలు వస్తున్నాయి. వండితే ముద్దగా అవుతోందని, పిల్లలు సైతం తినలేకపోతున్నారని ఓ లబ్ధిదారుడు వాపోయాడు. సివిల్ సప్లై డిటి, అధికారులు ప్రతి లారీని చెక్ చేస్తామంటారు. మరి ఇన్ని నూకల బస్తాలు ఎలా వస్తున్నాయి? గోదాములోనే మార్పిడి జరుగుతుందా? అని ప్రజలు నిలదీస్తున్నారు. పేదలకు ఇచ్చేది కాబట్టి ఎవరూ పట్టించుకోవడం లేదనే భావనతో అధికారులు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.


### బరువులోనూ భారీ కోత..డీలర్లకు చుక్కలు

రేషన్ సరఫరాలో నాణ్యత ఒక్కటే కాదు, బరువులోనూ గోల్‌మాల్ జరుగుతోందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రేషన్ షాపులకు వచ్చే ప్రతి బస్తా 50 కిలోల 650 గ్రాములు ఉండాలి. కానీ వస్తున్న బస్తాల్లో కొన్ని 45 నుంచి 46 కిలోల మధ్యే ఉంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం మాకు 50.650 కిలోల లెక్కన బియ్యం ఇస్తుంది. కానీ బస్తాలో 4-5 కిలోలు తక్కువ వస్తే ఆ నష్టం ఎవరు భరిస్తారు? లబ్ధిదారులకు పూర్తి కోటా ఇవ్వలేక మాటలు పడుతున్నామని ఓ డీలర్ ఆవేదన చెందారు. దీంతో లెక్కలు సరిపోక, పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని డీలర్లు చెబుతున్నారు.

### పేదోడి కడుపు కొట్టొద్దు - వెంటనే చర్యలు తీసుకోండి

ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పేదలకు అందిస్తున్న పథకం ఇది. కానీ మధ్యలోనే నాణ్యత, బరువు విషయంలో జరుగుతున్న అక్రమాల వల్ల అసలు లబ్ధిదారులకే నష్టం జరుగుతోంది. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న సంక్షేమ పథకానికి ఇదేనా నిదర్శనమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పుక్కిటికి ఇచ్చేది కాబట్టి పట్టించుకోవడం లేదు. అదే మార్కెట్‌లో అమ్మే బియ్యం అయితే ఇలా ఇస్తారా? అని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, చల్లగోదాముల నుంచి జరిగే ప్రతి సప్లైని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యత, బరువులో జరుగుతున్న అక్రమాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, డీలర్లు డిమాండ్ చేస్తున్నారు.

# పైసలిస్తేనే పని.. లేదంటే ఫైలు పెండింగ్




- మ్యుటేషన్ నుంచి వారసత్వ మార్పిడి వరకు ఇదే కథ
- ధ్రువీకరణ పత్రాలకూ 'రేటు'
- భూమి వ్యవహారాల్లో మధ్యవర్తుల హవా
- తనిఖీలు ఉన్నా.. తగ్గని వసూళ్లు
- జనగామలో బాధితులకు ముప్పతిప్పలు

కాకతీయ,నిఘా ప్రతినిధి : జనగామ జిల్లాలోని మండల రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతి వ్యవహారాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల అవసరాలు, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొన్ని పనులకు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం పూర్తి కావాల్సిన పనులు సైతం ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడం.. పైసలు ముట్టజెప్పిన తర్వాతే కదిలించడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. భూముల మ్యుటేషన్, వారసత్వ మార్పిడి, పట్టాదారు పాస్‌బుక్ సంబంధిత పనులు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ,ఆదాయ,కుల,నివాస ధ్రువీకరణపత్రాలు తదితర సేవల్లో అక్రమ వసూళ్లకు ఆస్కారం ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తుల్లో చిన్నచిన్న లోపాలను చూపుతూ ప్రజలను పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిప్పడం. మధ్యవర్తుల ద్వారా పని చేయించుకుంటే మాత్రం త్వరగా పూర్తిచేయడం జరుగుతోందని పలువురు చెబుతున్నారు.

### భూమి పనులకే ఎక్కువ డిమాండ్

రెవెన్యూ కార్యాలయాల్లో భూములకు సంబంధించిన వ్యవహారాలే ప్రధానంగా అవినీతికి ఆస్కారం కల్పిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వారసత్వంగా వచ్చిన భూమిని కుటుంబ సభ్యుల పేర్లపై మార్చడం, రికార్డుల్లో మార్పులు చేయడం, భూ వివరాల పరిశీలన, ధ్రువీకరణ, వివిధ రకాల నివేదికల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు 'ఖర్చులు' పేరుతో డబ్బులు అడుగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పని ఆలస్యమవుతుందని చెప్పి ఒత్తిడి చేయడం.. చివరకు ఎంతోకొంత ఇచ్చిన తర్వాత ఫైలు ముందుకు కదులుతుందన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని మండల కేంద్రాల్లో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే మధ్యవర్తుల వ్యవస్థ కూడా అవినీతికి ఊతమిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు నేరుగా అందాల్సిన సేవలకు కూడా మధ్యవర్తుల ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. దరఖాస్తు నుంచి ఫైలు క్లియరెన్స్ వరకు ఒక్కో దశకు ఒక్కో రేటు నిర్ణయించినట్లుగా వ్యవహారం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తనిఖీలు ఉన్నా.. తగ్గని వసూళ్లు

రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజలకు అందాల్సిన సేవలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో అందించడంతో పాటు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలించి, ప్రతి సేవకు నిర్ణయించిన రుసుము, సమయ పరిమితిని కార్యాలయాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని డిమాండ్ చేస్తున్నారు.

# 108 గ్రామాలు.. మిషన్ భగీరథకు రూ.20.96 కోట్లు

- ములుగు నియోజకవర్గంలో తాగునీటి మౌలిక వసతుల అభివృద్ధికి ఆమోదం
- ములుగు, కొత్తగూడ, గంగారం మండలాల్లో పనులు
- ఓహెచ్ఎస్ఆర్‌లు, పైప్‌లైన్లు, బోర్‌వెల్ల నిర్మాణం
- భూగర్భ జలాల లభ్యతపై సమగ్ర సర్వే
- నిర్ణీత గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశం



కాకతీయ, ములుగు ప్రతినిధి: ములుగు నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మారుమూల గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటి మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు 108 గ్రామాలు, ఆవాసాల్లో మిషన్ భగీరథ పనులకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.20 కోట్ల 96 లక్షల 49 వేల నిధులను మంజూరు చేసింది. ములుగు జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం మండలాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నెం.428ను విడుదల చేసింది. ములుగు నియోజకవర్గంలోని పలు మారుమూల గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటి సమస్య ఏళ్లుగా ప్రజలను వేధిస్తోంది. ముఖ్యంగా వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉన్న నీటి వనరులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అదనపు, ప్రత్యామ్నాయ తాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 108 గ్రామాలు, ఆవాసాల్లో మిషన్ భగీరథ నిధులతో వివిధ మౌలిక వసతుల పనులు చేపట్టేందుకు పచ్చజెండా ఊపింది.

### రూ.20.96 కోట్లతో పనులు

మిషన్ భగీరథ పనుల కోసం ప్రభుత్వం రూ.20 కోట్ల 96 లక్షల 49 వేల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా తాగునీటి మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే ఉన్న సరఫరా వ్యవస్థకు అదనంగా ప్రత్యామ్నాయ సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో తాగునీటి సరఫరాలో అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవిలో నీటి కొరత ఎదురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన వసతులను కల్పించనున్నారు. మంజూరైన నిధులతో అవసరమైన ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు (ఓహెచ్ఎస్ఆర్‌లు), పైప్‌లైన్లు, బోర్‌వెల్లు తదితర పనులు చేపట్టనున్నారు. నీటిని నిల్వ చేసేందుకు రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేలా పైప్‌లైన్లను ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన చోట్ల బోర్‌వెల్లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రస్తుతం తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు అవకాశం ఉంటుంది. నీటి వనరుల లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నారు.

### భూగర్భ జలాలపై సర్వే

పనులు ప్రారంభించే ముందు ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల లభ్యతపై సమగ్ర సర్వే నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. బోర్‌వెల్ల నిర్మాణానికి ముందు నీటి లభ్యతను శాస్త్రీయంగా పరిశీలించాలని ఆదేశించింది. అలాగే మిషన్ భగీరథ పనుల నిర్మాణంలో నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించింది. నీటి వనరుల ఎంపిక, నిర్మాణాల రూపకల్పన, పైప్‌లైన్ల ఏర్పాటు తదితర అంశాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది. మంజూరైన పనులను గ్రామ పంచాయతీలతో సమన్వయం చేసుకుంటూ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. పనుల నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించింది. మిషన్ భగీరథ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయాల్సి ఉంది. ప్రతిపాదిత పనులు పూర్తయితే ములుగు నియోజకవర్గంలోని 108 గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

# ఖమ్మం అభివృద్ధికి తుమ్మలే బ్రాండ్ అంబాసిడర్

**సమగ్రాభివృద్ధి, సంక్షేమమే మంత్రి ధ్యేయం**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు యర్రం బాలగంగాధర్ తిలక్**



కాకతీయ, ఖమ్మం : ఖమ్మం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, నగరానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఖమ్మం త్రీటౌన్ ఏరియా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ అన్నారు. ఖమ్మం నగరంలోని జూబ్లీ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి , షాదీముబారక్ కింద 1177 మంది లబ్ధిదారులకు రూ.1,78,36,532, ఎల్‌ఓసీల ద్వారా 213 మందికి రూ.4,71,30,000, సీఎంఆర్‌ఎఫ్ కింద 2365 మందికి రూ.7,27,90,000 అందించామని తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

### నగర రూపురేఖలు మారేలా పనులు

రూ.249 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, రూ.700 కోట్లతో మున్నేరు వరద రక్షణ గోడలు, రూ.220 కోట్లతో వరద నీటి మళ్లింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. మున్నేరుపై రూ.180 కోట్లతో కేబుల్ వంతెన నిర్మాణం, రూ.150 కోట్లతో వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ, ఖిల్లాకు రూ.15 కోట్లతో రోప్‌వే ఏర్పాటు జరుగుతోందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ నిధులతో రూ.220 కోట్లు తీసుకొచ్చామని చెప్పారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల పనులు, క్రీడా ప్రాంగణాలు, జిల్లా కోర్టు, వెలుగుమట్లలో 500 ఎకరాల అర్బన్ పార్కు, శిల్పారామం తదితర అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తిలక్ తెలిపారు. సమావేశంలో తల్లాడ రమేష్, కొప్పర సరిత ఉపేందర్, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, గజ్జల లక్ష్మీ వెంకన్న, దొన్వాన్ సరస్వతి రవి, తూములూరి లక్ష్మీనరసింహారావు, కలిమెల భద్రయ్య, భోజడ్ల సత్యనారాయణ, యాసబోయిన శ్రీశైలం, పత్తికొండ శ్రీనివాసులు, గెల్లా కృష్ణవేణి, బాలిని శ్రీనివాస్, దేవర వెంకన్న, ఎస్‌కే జాకీర్, గుడ్లశ్రీనివాసరావు,తోళ్లకుటుంబరావు,బాణాలలక్ష్మణ్‌తదితరులు పాల్గొన్నారు.

# వైరా రోడ్ చర్చి..

## వాణిజ్య కేంద్రంగా మారిందా?!

**ఆంధ్ర వెల్ఫేర్ సొసైటీ పేరుతో చర్చి భవనం విక్రయంపై ఆరోపణలు**

- చర్చి స్థలంలో భారీ బహుళ అంతస్తుల నిర్మాణం
- ప్రైవేటు వ్యక్తులకు భవనంలోని కొంత భాగం విక్రయించారంటున్న స్థానికులు
- సొసైటీ రికార్డులపై అనుమానాలు..
- కలెక్టర్ దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి?

కాకతీయ, ఖమ్మం బ్యూరో : దేవుడి సేవ కోసం ఉపయోగించాల్సిన చర్చి స్థలం.. వాణిజ్య కార్యకలాపాలకు వేదికగా మారిందా? చర్చి ఆస్తుల నిర్వహణకు నిర్దిష్ట నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటిని పక్కన పెట్టి భవన నిర్మాణాలు చేపట్టి, అందులో కొంత భాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారన్న ఆరోపణలు ఖమ్మం నగరంలో చర్చనీయాంశంగా మారాయి. ఖమ్మం నగరం వైరా రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఉన్న చర్చి స్థలంలో భారీ బహుళ అంతస్తుల భవనం నిర్మించి.. అందులో కొంత భాగాన్ని విక్రయించినట్లు స్థానిక భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక 'ఆంధ్ర వెల్ఫేర్ సొసైటీ' పేరుతో చేపట్టిన కార్యకలాపాలు ఏమిటి? సొసైటీకి ఆస్తుల విక్రయం చేసే అధికారం ఉందా? సంబంధిత అనుమతులు తీసుకున్నారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. చర్చి ఆస్తులు సాధారణ వ్యక్తిగత ఆస్తుల మాదిరిగా విక్రయించడానికి వీలుంటుందా? ఒకవేళ విక్రయించాల్సి వస్తే సంబంధిత చర్చి యాజమాన్యం, డైసిస్ స్థాయిలో అవసరమైన అనుమతులు తీసుకున్నారా? ఆస్తి విక్రయం ద్వారా వచ్చిన నిధులను ఏ అవసరాలకు వినియోగించారు? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### చర్చి స్థలం.. నిర్మాణం.. విక్రయం?

వైరా రోడ్డులోని ఆర్‌సీఎం చర్చికి పక్కనే చర్చికి సంబంధించిన స్థలం కొంతకాలంగా చర్చి యాజమాన్యాల పేరుతో కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల అక్కడ భారీ బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు సమాచారం. అయితే ఆ భవనంలో కొంత భాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్చి ఆస్తిని ఏ ప్రాతిపదికన వాణిజ్య అవసరాలకు వినియోగించారు? నిర్మాణానికి ఎవరి అనుమతులు తీసుకున్నారు? భవనంలోని భాగాల విక్రయానికి సంబంధిత ధార్మిక సంస్థల అనుమతి ఉందా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఆర్‌సీఎం చర్చిలు సాధారణంగా క్యాథలిక్ డైసిస్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని.. ఆస్తుల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. చర్చి స్థలాన్ని విక్రయించాలంటే ప్యారిష్ స్థాయిలో తీర్మానం, సంబంధిత బిషప్ లేదా డైసిస్ అనుమతి, ఆర్థిక అనుమతులు వంటి ప్రక్రియలు ఉండాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు. విలువైన ఆస్తుల విషయంలో మరిన్ని అనుమతులు అవసరమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే వైరా రోడ్డులోని ఆస్తికి సంబంధించి ఈ ప్రక్రియ మొత్తం పాటించారా? లేదా? అనేది అధికారిక రికార్డుల పరిశీలనలోనే తేలాల్సి ఉంది.




### 'ఆంధ్ర వెల్ఫేర్ సొసైటీ' పేరుతోనేనా?

ఈ వ్యవహారంలో 'ఆంధ్ర వెల్ఫేర్ సొసైటీ' పేరు కూడా తెరపైకి వస్తోంది. స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణ కోసం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోని రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఈ సంస్థకు అనుమతులు పొందినట్లు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం తెలంగాణ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో సంస్థకు సంబంధించిన పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు స్పష్టంగా అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. సొసైటీ రెన్యువల్ కోసం పలుమార్లు దరఖాస్తులు చేసినట్లు ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు కనిపిస్తున్నప్పటికీ.. సంబంధిత పత్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. సంస్థకు ఆస్తులు కొనుగోలు, నిర్మాణాలు, విక్రయాలు చేపట్టే అధికారం ఏ మేరకు ఉంది? చర్చి ఆస్తికి, సొసైటీకి ఉన్న సంబంధం ఏమిటి? సొసైటీ పేరుతో ఏయే ఆస్తులు ఉన్నాయి? వాటి నిర్వహణ, విక్రయాలకు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? అన్న అంశాలపై రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### కలెక్టర్ దృష్టి సారిస్తే..

చర్చి స్థలం, నిర్మాణ అనుమతులు, ఆస్తి విక్రయాలు, సొసైటీ రిజిస్ట్రేషన్, రెన్యువల్ వివరాలతోపాటు ఆస్తి వినియోగానికి సంబంధించిన రికార్డులను జిల్లా యంత్రాంగం పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా భవన నిర్మాణానికి అనుమతులు ఎవరు ఇచ్చారు? నిర్మాణం ఏ ప్రయోజనం కోసం చేపట్టారు? భవనంలోని కొంత భాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేందుకు అనుమతి ఉందా? విక్రయానికి సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగిందా? జరిగితే ఏ సంస్థ లేదా వ్యక్తి పేరుతో జరిగింది? అన్న అంశాలను పరిశీలించాలని కోరుతున్నారు. అదేవిధంగా చర్చి ఆస్తుల విక్రయం జరిగి ఉంటే.. దానికి సంబంధించిన తీర్మానాలు, డైసిస్ అనుమతులు, ఆర్థిక అనుమతులు, విక్రయ పత్రాలు, వచ్చిన నిధుల వినియోగంపై కూడా విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవమెంత? నిబంధనలు ఉల్లంఘించారా? లేక అన్ని అనుమతులతోనే నిర్మాణం, విక్రయ ప్రక్రియ జరిగిందా? అన్నది అధికారిక దర్యాప్తుతోనే తేలనుంది. చర్చి పేరుతో ఉన్న ఆస్తి వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించబడిందన్న ఆరోపణలు నిజమైతే.. ఇది కేవలం ఆస్తి వ్యవహారం కాకుండా భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశంగానూ మారే అవకాశం ఉంది. అందుకే జిల్లా కలెక్టర్ సమగ్రంగా రికార్డులు పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంటిగ్రేటెడ్ గురుకులాలు.. మార్పు తెచ్చేనా?

- కొత్త ప్రభుత్వానికి ఇది ఓ సవాల్!
- సమస్యల వలయంలో ప్రస్తుత గురుకులాలు
- అద్దె భవనాల్లోనే 90 శాతం నిర్వహణ
- వసతుల్లేక.. విద్యార్థుల అవస్థలు
- పర్యవేక్షణ లోపాలకు చెక్ పడేనా?




కాకతీయ, ఖమ్మం : అన్ని వర్గాల గురుకులాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు ఇప్పుడు కీలక సవాల్‌గా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఇప్పటివరకు వేర్వేరుగా కొనసాగుతున్న గురుకులాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకురావడం ద్వారా కుల, మత భేదాలకు అతీతంగా విద్య అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. పైలెట్ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నియోజకవర్గాల్లో ఈ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఆలోచన కొత్తది.. లక్ష్యం పెద్దది. కానీ ఇప్పటివరకు ఉన్న గురుకులాల పరిస్థితి చూస్తే.. కొత్త విధానం ఆచరణలో ఎంతవరకు ఫలిస్తుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### సమస్యల వలయంలో గురుకులాలు

గురుకుల విద్య అంటే కేవలం ఉచిత విద్య, వసతి కల్పించడం మాత్రమే కాదు. విద్యార్థులు సురక్షితంగా ఉండేందుకు అనువైన భవనాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం, సరిపడా తరగతి గదులు, వసతి గదులు ఉండాలి. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు గురుకులాల్లో ఇవన్నీ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలు అనేకం ఉన్నాయి. ఖమ్మంజిల్లా పరిధిలో సుమారు 90 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్న పరిస్థితి ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ప్రభుత్వం అద్దెల రూపంలో భారీగా నిధులు వెచ్చిస్తున్నా.. విద్యార్థులకు మాత్రం అవసరమైన సౌకర్యాలు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### అద్దె భవనాలు.. అరకొర వసతులు

గురుకులాల నిర్వహణకు సరైన భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఇరుకైన గదుల్లోనే గడపాల్సి వస్తోంది. తరగతి గదులు, వసతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు విద్యార్థుల సంఖ్యకు సరిపడా లేకపోవడం సమస్యగా మారింది. కొన్ని చోట్ల 300 మంది విద్యార్థులకు సరిపడే వసతి సామర్థ్యం ఉండగా.. 800 మందికి పైగా విద్యార్థులను చేర్చుకున్న సందర్భాలున్నాయి. ఒక గదిలో 20 మంది ఉండాల్సిన పరిస్థితికి బదులుగా 40, 50 మంది వరకు ఉంటున్న ఘటనలు కూడా వెలుగుచూశాయి. ఇరుకు గదుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను ఉంచడం వల్ల వారి చదువుతో పాటు ఆరోగ్యం, భద్రతపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

### భోజనం.. పారిశుద్ధ్యం.. అన్నీ సమస్యలే

గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా.. కొన్ని చోట్ల మెనూ ప్రకారం భోజనం అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సమయానికి భోజనం వడ్డించకపోవడం, నిర్ణయించిన మెనూకు భిన్నంగా వంటలు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు మరుగుదొడ్ల కొరత, పారిశుద్ధ్య లోపాలు కూడా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తాగునీటి సమస్యతో పాటు మురుగునీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రాంగణాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వర్షం పడితే కొన్ని గురుకులాల్లో తరగతి గదుల్లోకి నీరు చేరుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థినుల గురుకులాల్లో భద్రత అత్యంత కీలకం. అయినా కొన్ని మహిళా గురుకులాల్లో వంట పనులకు పురుషులను వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థినుల వసతి ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో మరింత కఠినమైన నిబంధనలు, పర్యవేక్షణ అవసరం. ఇలాంటి అంశాల్లో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. గురుకులాల నిర్వహణలో సిబ్బంది, వసతి, భోజనం, భద్రత, పారిశుద్ధ్యం వంటి ప్రతి అంశంపై బాధ్యతలు స్పష్టంగా నిర్దేశించాల్సి ఉంది.

### ఇంటిగ్రేటెడ్‌తోనైనా మార్పు వస్తుందా?

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ గురుకులాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను వేర్వేరుగా నిర్వహించే విధానానికి బదులుగా.. ఒకే ప్రాంగణంలో అన్ని వర్గాల విద్యార్థులకు విద్య అందించాలన్న ఆలోచన సామాజిక సమానత్వానికి దోహదపడే అవకాశం ఉంది. అయితే భవనాలు కొత్తగా నిర్మించడం ఒక్కటే సరిపోదు. గత గురుకులాల్లో కనిపించిన లోపాలు కొత్త ప్రాంగణాల్లో పునరావృతం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, భోజనశాలలు, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు ఉండాలి. నిర్వహణలో జవాబుదారీతనం లేకపోతే ఎంత భారీ ప్రాజెక్టు అయినా ఆశించిన ఫలితాన్ని ఇవ్వదు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలు తెలంగాణ విద్యారంగంలో పెద్ద ప్రయోగం. కులమత భేదాలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం ప్రశంసనీయమే. అయితే ప్రయోగం విజయవంతం కావాలంటే నిర్మాణాల కంటే నిరంతర పర్యవేక్షణ, సమర్థ నిర్వహణ, నాణ్యమైన భోజనం, పారిశుద్ధ్యం, భద్రత, విద్యార్థుల సంఖ్యకు తగిన మౌలిక వసతులు కీలకం. ప్రస్తుతం ఉన్న గురుకులాల్లోని సమస్యలను అధ్యయనం చేసి.. వాటికి శాశ్వత పరిష్కారాలు చూపినప్పుడే కొత్త విధానం సార్థకమవుతుంది. లేకపోతే పేర్లు మారినా.. సమస్యలు మాత్రం కొనసాగుతాయన్న భయం ఉంటుంది. అందుకే ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ప్రభుత్వం కేవలం నిర్మాణ ప్రాజెక్టుగా కాకుండా.. గురుకుల వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసే అవకాశంగా చూడాల్సిన అవసరం ఉంది.

# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

**అత్యుత్తమ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు**

**ప్రతిపాదనలను త్వరితగతిన అమలు దశకు తీసుకురావాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



కాకతీయ, ఖమ్మం టౌన్ : ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులు, సరస్సులను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నీటి వనరులు, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం బోనకల్, మధిర మండలాల్లో పర్యటించిన కలెక్టర్ కలకోట పెద్దచెరువు, మడుపల్లి, మధిర ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో లోపాలు తలెత్తితే సహించేది లేదన్నారు.

### పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో ఉపాధి

మధిర రివర్‌ఫ్రంట్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మధిర ట్యాంక్‌బండ్ వద్ద కాటేజీలు, రిసెప్షన్, కిచెన్, రెస్టారెంట్, విద్యుదీకరణ, మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కలకోట పెద్దచెరువు వద్ద కాటేజీలు, కేఫెటేరియా, పార్కింగ్ తదితర సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో స్థానికులకు ఉపాధి, చిన్న వ్యాపారాలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతిపాదనలను త్వరగా ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటక అభివృద్ధికి భూమి అవసరమైన చోట భూసేకరణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి బి. సుమన్ చక్రవర్తి, తహసీల్దార్లు రాంబాబు, బోనకల్ తహసీల్దారు, ఆర్ అండ్‌బీ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరంగాతో హోరెత్తిన కరకగూడెం

**నవోదయ విద్యార్థుల దేశభక్తి ర్యాలీ**




కాకతీయ, కరకగూడెం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కరకగూడెం మండలంలో జవహర్ నవోదయ విద్యార్థులు శుక్రవారం దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని విద్యార్థులు కదం తొక్కడంతో కరకగూడెం పరిసరాలు దేశభక్తి నినాదాలతో మార్మోగాయి. క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు జాతీయ జెండా ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని చాటిచెప్పారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య వేడుకల్లో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రత్తయ్య మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. జాతీయ జెండా దేశ ప్రజల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో దేశం పట్ల బాధ్యత, గౌరవ భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ ప్రశాంతం గా జరిగేలా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీతారామ లింక్ కెనాల్ పనుల్లో నాణ్యత డొల్ల!





### అధికారుల పర్యవేక్షణ లేకుండానే మరమ్మతులు

### సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

కాకతీయ, ఏన్కూరు: కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనుల్లో నాణ్యత లోపాలు వెలుగు చూస్తున్నాయని సీపీఐ(ఎం) నాయకులు ఆరోపించారు. వినోబానగర్ నుంచి ఏన్కూరు ఎన్ఎస్పీ కెనాల్ వరకు నిర్మించిన కాలువలో నిర్మాణం పూర్తయిన కొన్ని నెలలకే సీసీ లైనింగ్ పెచ్చులు ఊడిపోవడం, పలుచోట్ల పగుళ్లు ఏర్పడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపించారు. శుక్రవారం సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, ఏన్కూరు మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులతో కలిసి లింక్ కెనాల్‌ను పరిశీలించారు. కాలువలో పలుచోట్ల సీసీ లైనింగ్ దెబ్బతిన్న తీరును పరిశీలించారు. కాంక్రీట్ పెచ్చులు ఊడిపోవడంతో పాటు పగుళ్లు ఏర్పడిన ప్రాంతాలను గుర్తించారు. కాలువ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని భూక్యా వీరభద్రం ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు పూర్తయిన కొద్దికాలానికే దెబ్బతినడం అధికారుల, కాంట్రాక్టర్ల పనితీరుకు నిదర్శనమన్నారు. నాణ్యతా లోపాలు బయటపడిన తర్వాత వాటిని కప్పిపుచ్చేందుకు హడావుడిగా మరమ్మతులు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంక్రీట్ లారీలతో వచ్చి మరమ్మతులు చేపట్టడం సరికాదన్నారు. ముందుగా కాలువ నిర్మాణ నాణ్యతపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారుల సమక్షంలోనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు.

### పనులను అడ్డుకున్న నాయకులు

ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకుండానే మరమ్మతులు ఎలా చేపడతారని నాయకులు ప్రశ్నించారు. సంబంధిత అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినా వారు స్పందించలేదని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించే వరకు పనులు కొనసాగించడానికి వీల్లేదని హెచ్చరిస్తూ మరమ్మతులను అడ్డుకున్నారు.

### క్వాలిటీ కంట్రోల్‌కు ఫిర్యాదు : సీపీఐ(ఎం) ఏన్కూరు మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు

సీతారామ లింక్ కెనాల్ పనులపై క్వాలిటీ కంట్రోల్ విభాగానికి, ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు దొంతబోయిన నాగేశ్వరరావు తెలిపారు. కాలువ నిర్మాణంలో ఉపయోగించిన సామగ్రి, కాంక్రీట్ నాణ్యత, పనుల పర్యవేక్షణ తదితర అంశాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరారు. నాణ్యత లోపాలకు కారణమైన అధికారులతో పాటు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో చేపట్టిన ప్రాజెక్టు పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. విచారణ పూర్తయ్యే వరకు మరమ్మతులు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూక్యా లక్ష్మా, నందూరి శ్రీను, సీపీఐ(ఎం) నాయకులు, స్థానిక రైతులు నరసింహారావు, రాములు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

### 1,900 లీటర్ల చక్కెర పానకం ధ్వంసం

### 55 లీటర్ల నాటు సారా, 60 కిలోల బెల్లం స్వాధీనం

### నాటు సారా తయారీకి పాల్పడుతున్న 9 మందిపై కేసులు



కాకతీయ, నల్లబెల్లి: నాటు సారా నిర్మూలనలో భాగంగా ఎక్సైజ్ అధికారులు నల్లబెల్లి మండలంలో గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ దత్త రాజు గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు నర్సంపేట స్టేషన్ పరిధిలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. నర్సంపేట, పరకాల ఎక్సైజ్ స్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,900 లీటర్ల చక్కెర పానకాన్ని అధికారులు ధ్వంసం చేశారు. 55 లీటర్ల నాటు సారా, 60 కిలోల బెల్లం, 10 కిలోల పట్టికను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారీకి పాల్పడుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ట్రైనీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు లక్ష్మణ్ ఆనంద్, నీలోఫర్, సుచిత, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌చందర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నాగయ్య, నాగేశ్వరరావు, ఎస్సైలు చంద్రశేఖర్, సులోచన, షరీఫ్, సురేష్‌రెడ్డి తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### పైలాన్, నూతన కలెక్టరేట్ ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

### అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

### కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



కాకతీయ, ములుగు ప్రతినిధి : ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేసి, అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీకి సూచించారు. మేడారంలో వనదేవతల దర్శనం, తులాభారం, పించన్ల పంపిణీతో పాటు నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, సభా ప్రాంగణంలో ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

### పైలాన్ పనులు తుదిదశకు

అనంతరం గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న పైలాన్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి సుందరీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. నూతన కలెక్టరేట్‌లో పూజా కార్యక్రమం, సమావేశపు గది, రాష్ట్ర ఛాంబర్, లిఫ్ట్, జనరేటర్, విద్యుత్, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలను పరిశీలించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా లిఫ్ట్, జనరేటర్, విద్యుత్ వ్యవస్థలను ముందుగానే పరీక్షించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో విధులు నిర్వహించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్, ఆర్అండ్‌బీ అధికారి శ్యామ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్ఈ ఈడీ ధర్మ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పీవో సార్ అక్రమ వసూళ్లపై చర్యలేవీ

### అక్రమాలు బయటపడ్డా అధికారి మౌనం ఎందుకు?

### కోరేకల్ ఇసుక కాంట్రాక్టర్‌పై విచారణ చేపట్టరెందుకు..?

### వీడియోలు బయటపడినా బాధ్యులపై చర్యలేవీ?

### మూడు రోజులుగా ఆరా పేరిట అధికారి తాత్సారం

### కాంట్రాక్టర్లకు అండగా నిలుస్తున్నారా?



కాకతీయ, తెలంగాణ బ్యూరో: కోరేకల్ ఇసుక స్టాక్‌యార్డులో అక్రమ వసూళ్ల ఆరోపణలు వెలుగులోకి వచ్చి మూడు రోజులు దాటినా.. సంబంధిత కరీంనగర్ టీజీఎండీసీ పీవో నుంచి మాత్రం చర్యల జాడ కనిపించడంలేదు. ఒక్కో లారీ నుంచి రూ.3,500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలకు సంబంధించిన వీడియోలు మూడు రోజుల క్రితం బయటపడ్డాయి. వ్యవహారం బహిర్గతమైన వెంటనే విచారణకు ఆదేశించి.. బాధ్యులను గుర్తించి.. అవసరమైతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన పీవో.. ‘విచారణ చేస్తున్నాం’ అంటూ సరిపెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వసూళ్లపై వీడియో ఆధారాలు బయటకొచ్చినప్పుడు కూడా చర్యలు తీసుకోకపోతే.. పర్యవేక్షణాధికారి బాధ్యత ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. అక్రమాలు బయటపడినా పీవో ఎందుకు స్పందించడం లేదు? కాంట్రాక్టర్లను ఎందుకు ప్రశ్నించడం లేదు? బాధ్యులను ఎందుకు పక్కకు తప్పించడం లేదు? అన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

### కోరేకల్ క్వారీపై ఆరోపణలు వస్తే.. పీవో ఏం చేస్తున్నారు?

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కోరేకల్ ఇసుక స్టాక్‌యార్డులో లారీదారుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఒక్కో లారీకి రూ.3,500 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు వీడియోల్లో కనిపిస్తున్న దృశ్యాలు బయటకు రావడంతో వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. ఇది సాధారణ ఆరోపణ కాదు. ప్రభుత్వ ఇసుక విక్రయ కేంద్రంలో వినియోగదారుడి నుంచి అధికారిక చార్జీలకు మించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణ. ఇలాంటి ఆరోపణ బయటపడిన వెంటనే సంబంధిత అధికారి అప్రమత్తం కావాలి. కానీ మూడు రోజులుగా పెద్దగా కదలిక కనిపించకపోవడమే ఇప్పుడు పలు ప్రశ్నలకు కారణమవుతోంది. అక్రమ వసూళ్లకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చిన తర్వాత పీవో చేయాల్సిన మొదటి పని వాటి వాస్తవికతను నిర్ధారించడం. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తులు ఎవరు? స్టాక్‌యార్డులో వారి బాధ్యత ఏమిటి? ఎవరెవరికి డబ్బులు ఇచ్చారు? ఎంత మొత్తంలో తీసుకున్నారు? అన్నదానిపై ప్రాథమిక విచారణ జరపవచ్చు. అవసరమైతే సంబంధిత లారీ డ్రైవర్లు, యజమానుల వాంగ్మూలాలు తీసుకోవచ్చు. స్టాక్‌యార్డులోని సీసీ కెమెరా ఫుటేజీని భద్రపరచవచ్చు. కానీ మూడు రోజులు గడిచినా ఈ చర్యల్లో ఏవి చేపట్టారో స్పష్టత లేదు. పీవో విచారణ చేస్తున్నారంటే.. ఎవరిని విచారించారు? ఏం తేలింది? అన్నది చెప్పాల్సిన అవసరం ఉంది. లేదంటే ‘విచారణ’ అన్న పదం కేవలం కాలయాపనకే పరిమితమైందన్న అనుమానాలకు తావివ్వదా?

### రూ.3,500 అదనపు వసూళ్ల వెనుక ఎవరున్నారు?

అదనపు వసూళ్ల ఆరోపణల్లో అసలు తేలాల్సింది కేవలం డబ్బులు ఎవరు తీసుకున్నారన్నది మాత్రమే కాదు. ఆ డబ్బులు ఎవరి సూచనలతో వసూలయ్యాయి? ఈ వ్యవహారం వ్యక్తిగతంగా జరుగుతోందా? లేక వ్యవస్థీకృతంగా సాగుతోందా? అన్నది కూడా బయటపడాలి. ఒక్కో లారీ నుంచి రూ.3,500 వరకు తీసుకుంటున్నారనే ఆరోపణలు నిజమైతే.. రోజుకు ఎన్ని లారీలు వస్తున్నాయి? ఎన్ని లారీల నుంచి అదనపు వసూళ్లు జరిగాయి? మొత్తం ఎంత డబ్బు వసూలైంది? అన్న లెక్క తేల్చడం అధికారులకు పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి వ్యవహారం కొనసాగుతున్నప్పుడు స్టాక్‌యార్డు పర్యవేక్షణలో ఉన్న అధికారులకు తెలియకుండా ఎలా జరుగుతోంది? తెలిసి ఉంటే ఎందుకు ఆపలేదు? తెలియకపోతే పర్యవేక్షణ వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందన్నది తేలాలి.

### కాంట్రాక్టర్లను ఎందుకు ప్రశ్నించడం లేదు?

అక్రమ వసూళ్ల ఆరోపణలు బయటపడిన వెంటనే సంబంధిత కాంట్రాక్టర్, నిర్వాహకులు, సిబ్బంది పాత్రపై విచారణ జరగాలి. కానీ ఇంతవరకు కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది స్పష్టంగా లేదు. కనీసం వివరణ కోరారా? స్టాక్‌యార్డులో ఆకస్మిక తనిఖీ చేశారా? రికార్డులను పరిశీలించారా? అదనపు వసూళ్ల ఆరోపణలపై లారీ యజమానులు లేదా డ్రైవర్ల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారా? అన్నది బయటకు రావాల్సి ఉంది. పీవో పర్యవేక్షణలోనే స్టాక్‌యార్డు నడుస్తున్నప్పుడు.. అక్కడి వ్యవహారాలకు బాధ్యత ఎవరిది? అక్రమ వసూళ్లు జరిగితే కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోతుందా? పర్యవేక్షణలో వైఫల్యం ఉంటే దానికి బాధ్యత వహించాల్సింది ఎవరు? అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

### మౌనం కొనసాగితే అనుమానాలు మరింత బలపడవా?

అక్రమ వసూళ్ల ఆరోపణలు బయటపడ్డాయి. వీడియోలు వెలుగులోకి వచ్చాయి. బాధితులను గుర్తించే అవకాశం ఉంది. సీసీ కెమెరాలు, లారీ ఎంట్రీలు, వెయిమెంట్ వివరాలు, విక్రయ రికార్డులు వంటి ఆధారాలు ఉన్నాయి. అయినా మూడు రోజులుగా చర్యలు కనిపించకపోవడం వల్ల పీవో తీరుపై అనుమానాలు పెరుగుతున్నాయి. అక్రమ వసూళ్లు జరగలేదంటే వెంటనే విచారణ జరిపి ఆ విషయాన్ని స్పష్టం చేయాలి. జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఈ రెండింటిలో ఏదో ఒకటి జరగాల్సిందే. ‘విచారణ చేస్తున్నాం’ అంటూ రోజులు గడపడం మాత్రం సమాధానం కాదు. కోరేకల్ ఇసుక స్టాక్‌యార్డులో అదనపు వసూళ్ల ఆరోపణలపై పీవో ఇప్పటికైనా స్పష్టమైన చర్యలు తీసుకుంటారా? లేక కాంట్రాక్టర్లపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోకుండా మౌనం వహిస్తారా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

## త్యాగాల స్ఫూర్తితో దేశాభివృద్ధికి పునరంకితం కావాలి

### ఖమ్మం జిల్లా ప్రజలకు పువ్వాడ అజయ్‌కుమార్ శుభాకాంక్షలు



కాకతీయ, ఖమ్మం టౌన్ : స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన మహనీయుల స్మృతులకు అంజలి ఘటిస్తూ ఖమ్మం జిల్లా ప్రజలకు మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.దేశం సాధించిన ప్రగతిలో, సమాజ వికాసంలో ఖమ్మం జిల్లా ప్రజల పాత్ర ప్రశంసనీయమన్నారు. రాజ్యాం గ స్ఫూర్తిని కాపాడుతూ శాంతి, సోదరభావంతో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్వాతంత్ర్య పోరాటంలో గత తరాలు చూపిన పోరాట పటిమ, ఐక్యత నేటి తరానికి మార్గదర్శకమని పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి సమైక్యంగా పునరంకితం కావాలని పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు.

## నేటి నుంచి కాకతీయ మ్యూజికల్ గార్డెన్

- వాకర్లకు ఉదయం ప్రత్యేక సమయం
- కుటుంబాలతో పగలు సందర్శనకు అవకాశం
- ప్రతిరోజూ సాయంత్రం మల్టీమీడియా షో
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను శనివారం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు వాకర్లకు మాత్రమే గార్డెన్‌లోకి అనుమతి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాధారణ సందర్శకులు, కుటుంబ సభ్యులు గార్డెన్‌ను సందర్శించవచ్చన్నారు. గార్డెన్ నిర్వహణ, సౌకర్యాల పరిరక్షణ కోసం సందర్శకుల నుంచి కనీస టికెట్ రుసుము వసూలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వినోదాన్ని అందించేందుకు ప్రతిరోజూ సాయంత్రం 7.30 గంటలకు మల్టీమీడియా షో, మ్యూజికల్ షో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాకతీయుల వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన గార్డెన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వరంగల్, హనుమకొండ ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి గార్డెన్‌ను సందర్శించి సౌకర్యాలను ఆస్వాదించాలని విజ్ఞప్తి చేశారు.

## ఖర్గే అవమానం వివక్షకు పరాకాష్ట

- వరంగల్‌లో కాంగ్రెస్ భారీ సత్యాగ్రహ ర్యాలీ
- ఖర్గేకు సంఘీభావంగా కాంగ్రెస్ శ్రేణుల కదలిక
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్




కాకతీయ, వరంగల్ ప్రతినిధి: కులం, మతం పేరుతో జాతీయ నాయకుడు మల్లికార్జున ఖర్గేను అవమానించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. శుద్ధీకరణ పేరుతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్నది బూటకపు నాటకమని విమర్శించారు. ఖర్గేకు సంఘీభావంగా శుక్రవారం వరంగల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ సత్యాగ్రహ ర్యాలీ నిర్వహించారు. వెంకట్రామ్ జంక్ష న్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కాశీబుగ్గలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైభీమ్ నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.

### సామాజిక న్యాయం కోసం పోరాటం

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవాన్ని కల్పించిందని అయూబ్ అన్నారు. దేశం అభివృద్ధి వైపు పయనిస్తున్న సమయంలో కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు. ఎవరి కులం, మతం, సామాజిక నేపథ్యం ఆధారంగా తక్కువ చేసి చూసే హక్కు ఎవరికీ లేదన్నారు. రాజ్యాంగ విలువలు, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని అయూబ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్ కాంగ్రెస్ కమిటీల నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమా

**స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి**

**రెండున్నరేళ్లుగా కాలయాపన సరికాదు**

**మంత్రుల నివాసాలను ముట్టడిస్తాం**

**పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ**




కాకతీయ, ఖమ్మం టౌన్ : విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రెండున్నరేళ్లుగా చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న మంత్రుల నివాసాలను ముట్టడిస్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ హెచ్చరించారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం విద్యార్థుల చదువులకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రూపొందించారని, ప్రస్తుతం అదే హక్కును ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యాసంస్థలు మూసివేసి నిరసన తెలిపినా ప్రభుత్వానికి చలనం లేదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రెండేళ్లుగా రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని విమర్శించారు. న్యాయస్థానాలు విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్‌షిప్‌లు జమ చేయాలని ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఇంజనీరింగ్, వైద్య, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు విద్యాసంస్థల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 20లోపు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 17న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంత్రుల నివాసాల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సమావేశంలో శశికిరణ్, తిమ్మిడిరఘు,యశ్వంత్,వెంకటేష్, సుశాంత్, త్రినాధ్, మనీష్ పాల్గొన్నారు.

## త్రివర్ణ పతాకాలతో దేశభక్తి వెల్లువ

**ఏన్కూరు వీధుల్లో మార్మోగిన స్వాతంత్ర్య నినాదాలు**

**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్మరణ**

**భారీ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ప్రజలు**



కాకతీయ, ఏన్కూర్ : ఏన్కూరు మండల కేంద్రంలో శుక్రవారం దేశభక్తి వెల్లివిరిసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ముందస్తు ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు త్రివర్ణ పతాకాలతో పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం, జైహింద్ నినాదాలతో ప్రధాన వీధులు మార్మోగాయి. త్రివర్ణ పతాకాల రెపరెపలతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన సమరయోధుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పలువురు పేర్కొన్నారు. స్వాతంత్ర్య వేడుకలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేయాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, సమరయోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యత భావాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాల రెపరెపలు, దేశభక్తి నినాదాల మధ్య సాగిన ర్యాలీ ఏన్కూరులో స్వాతంత్ర్య వేడుకల సందడిని ముందుగానే తీసుకొచ్చింది.

## ఖమ్మంలో 16న సమూహ రాష్ట్ర మహాసభ

**ప్రజాస్వామ్య, సాంస్కృతిక సంభాషణపై చర్చ**

**బహుళ సాంస్కృతిక అస్తిత్వంపై సదస్సు**

**రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యం : జీవన్, స్పర్శ భాస్కర్**



కాకతీయ, ఖమ్మం టౌన్ : సెక్యులర్ రైటర్స్ ఫోరం సమూహ రెండో రాష్ట్ర మహాసభ ఈ నెల 16న ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు వేదిక బాధ్యులు తెలిపారు. శుక్రవారం మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ కవి జీవన్, కరపత్రాన్ని స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు స్పర్శ భాస్కర్ ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య సాంస్కృతిక సంభాషణ, బహుళ సాంస్కృతిక అస్తిత్వం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలిక విలువలను కాపాడాలనే లక్ష్యంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు జీవన్, భాస్కర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజాస్వామ్య సాంస్కృతిక సంభాషణపై జరిగే సదస్సులో ప్రముఖ కవి, విశ్లేషకుడు ప్రసేన్ ప్రారంభోపన్యాసం చేస్తారని తెలిపారు. ప్రజాస్వామ్యం, పౌరసత్వ సమస్యలు, సవాళ్లపై జహాఅరా, సాహిత్యంలో బహుళ అస్తిత్వాలపై జీలుకర శ్రీనివాస్, వర్తమాన సామాజిక సందర్భం, సమూహ ఆచరణపై ఆర్. సీతారాం ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మెట్టు రవీందర్, పసునూరి రవీందర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి వివిధ సదస్సులకు అధ్యక్షులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలతో కూడిన భారతదేశ నిర్మాణానికి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీతారాం, ప్రసేన్, రమేష్‌కుమార్, ఫణి, మాధవి, కన్నోజు, సుభాషిణి, చిర్రా రవి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు తావు లేకుండా
# నూతన పెన్షన్‌దారుల ఎంపిక



**అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందేలా చర్యలు**

**క్షేత్రస్థాయిలో అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించాలి**

**దళారులను ఆశ్రయించొద్దు.. నేరుగా దరఖాస్తు చేసుకోవాలి**

**పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్**

కాకతీయ, గీసుగొండ :చేయూత పెన్షన్లలో నూతన పెన్షన్‌దారుల ఎంపికను ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాల్సిన బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మండలంలోని కొనాయిమాకుల రైతువేదికలో అధికారులు, సర్పంచులు వీక్షించారు. క్షేత్రస్థాయిలో అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కమిషనర్ సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు, కల్లుగీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, దివ్యాంగులు తదితర విభాగాల్లో అర్హులను గుర్తించి ఈ నెల 31వ తేదీలోగా తుది జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ సాంకేతిక కారణాలతో నష్టపోకుండా చూడాలన్నారు.

### దళారులను ఆశ్రయించొద్దు

పెన్షన్ కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని ప్రజలకు సూచించారు. పెన్షన్లు ఇప్పిస్తామంటూ మోసం చేసే దళారుల ప్రమేయం తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో వెన్నె కృష్ణవేణి, సూపరింటెండెంట్ కమలాకర్, సర్పంచులు రడం భరత్‌కుమార్, వజ్ర రాజు, వీరన్న, వీరేందర్, సుభాష్, రాఘవేంద్ర, వనిత, స్వప్న, యమున, జ్యోతి, దివ్య భారతి, అమృత, కమల, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# కుల వివక్షకు కేరాఫ్ బీజేపీ

**ఖర్గే ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడం దారుణం**

**కులం పేరుతో అవమానించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం**

**ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



కాకతీయ, వేములవాడ : దళిత నాయకుడు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శుద్ధి పేరుతో హవనం చేయడం కుల వివక్షకు, సామాజిక విభజనకు నిదర్శనమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కులం పేరుతో ఒకరిని అవమానించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన విజయ్ శంఖనాద్ సభలో ఖర్గే ప్రసంగించారు. రెండు రోజుల అనంతరం శ్రీరామ్ సేన కార్యకర్తలు అదే వేదిక వద్ద శుద్ధీకరణ హవనం నిర్వహించడంపై ఆది శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు.

### కుల వివక్షకు వ్యతిరేకంగా

ఖర్గే దళిత సమాజానికి చెందిన జాతీయ స్థాయి నాయకుడని, ఆయన ప్రసంగించిన ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఒక వ్యక్తి కులం ఆధారంగా ఆయన మాట్లాడిన వేదికను అపవిత్రంగా భావించడం ఎలాంటి సామాజిక న్యాయమని నిలదీశారు. రాజకీయ అభిప్రాయాలు భిన్నంగా ఉండొచ్చని, కానీ కులం, మతం పేరుతో ప్రజలను విభజించడం, వ్యక్తుల గౌరవాన్ని కించపరచడం సమర్థనీయం కాదన్నారు. బీజేపీ, దాని అనుబంధ సంస్థలు ప్రజలను విభజించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. మానవత్వం, సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావమే రాజ్యాంగ స్ఫూర్తి అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# ఖర్గేపై వివక్షను సహించం



- దళిత నాయకుడిని అవమానించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధం
- వేదిక శుద్ధీకరణ కుల వివక్షకు నిదర్శనం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



కాకతీయ, వరంగల్ బ్యూరో : దళిత నాయకుడు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై హల్ద్వానీలో జరిగిన వివక్షపూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. ఒక జాతీయ నాయకుడు ప్రసంగించిన వేదికను గంగాజలంతో శుద్ధీకరించడం, హవనం నిర్వహించడం కుల వివక్షకు పరాకాష్ఠ అని పేర్కొన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు శుక్రవారం అంబేద్కర్ జంక్షన్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీ అనంతరం గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేపట్టారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొని ఖర్గేకు సంఘీభావం తెలిపారు.

### రాజ్యాంగాన్ని అవమానించడమే

భారత రాజ్యాంగం అస్పృశ్యత, కుల వివక్షను నిషేధించిందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న దళిత నాయకుడిపై ఇలాంటి చర్యలు జరగడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు విరుద్ధమన్నారు. కులం, మతం ఆధారంగా ఎవరినీ తక్కువ చేసి చూసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఖర్గేపై వివక్షకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, అస్పృశ్యత నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. మాజీ మేయర్ గుండు సుధారాణి, పులి ప్రియాంక, తౌటం జాన్సీ, గొట్టిముక్కల సాగరిక రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాసరావు, బత్తిని శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్‌కు మూడున్నరేళ్ల జైలు

**నేరం రుజువు కావడంతో న్యాయస్థానం తీర్పు**

కాకతీయ, ఖమ్మం బ్యూరో : మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లిన కేసులో నిందితుడికి 3 సంవత్సరాల 6 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.30,000 జరిమానా విధిస్తూ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అర్వ ప్రవీణ్ తీర్పు ఇచ్చారని త్రీటౌన్ సీఐ మోహన్ బాబు తెలిపారు. ఈ ఏడాది జనవరి 8న రాత్రి ఖమ్మం రైల్వే ఓవర్ బ్రిడ్జి ట్రంక్ రోడ్ సమీపంలో మెట్లు ఎక్కుతున్న ఖానాపురానికి చెందిన వల్లభి లలిత, 58, మెడలోని సుమారు 20 గ్రాముల బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లాడని తెలిపారు. దీని విలువ సుమారు రూ.60,000 ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఖమ్మం 3టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 55/2026, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 304(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరంగల్ చింతల్ లేబర్ కాలనీకి చెందిన ఈదరబోయిన సుమన్, 39, ఆటోడ్రైవర్‌గా గుర్తించి అరెస్టు చేసి, న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ 3 సంవత్సరాల 6 నెలల జైలు, రూ.30,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

### సీఐ మోహన్ బాబు

కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసిన దర్యాప్తు అధికారి కె. సురేష్, ఎస్ఐ, ప్రభుత్వ న్యాయవాది శ్రీమతి ఎస్. గాయత్రి, సీడీవో వి. రామకృష్ణ, కోర్టు లైజన్ అధికారులు కె. శ్రీకాంత్, ఎస్ఐ డి. నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లను ఖమ్మం పోలీస్ కమిషనర్ అభినందించారు.

## పీఆర్టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా సూరం భాస్కర్‌రెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా బి. వీరన్న**



ఇనుగుర్తి పిఆర్టియు టీఎస్ మండల అధ్యక్షులు సూరం భాస్కర్ రెడ్డి



ప్రధాన కార్యదర్శి వీరన్న నాయక్

కాకతీయ, ఇనుగుర్తి : ఇనుగుర్తి మండల పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. 2026–28 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షుడిగా సూరం భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి. వీరన్న ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి. రాములు, రాజేష్‌కుమార్, ఎల్. స్వాతి, ఎస్. స్వప్న, పి. ఉత్తేజ్‌లను ఎన్నుకున్నారు. జిల్లా శాఖ అధ్యక్షుడు మిర్యాల సతీష్‌రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా నెల్లికుదురు మండల అధ్యక్షుడు యుగేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. పీఆర్టీయూ టీఎస్‌ను మండలంలో మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేసముద్రం మండల అధ్యక్షుడు గోపాల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బీరం జనార్దన్‌రెడ్డి, మహబూబాబాద్ మండల అధ్యక్షుడు రాంజీ నాయక్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమ్మ యాకయ్య, అసోసియేట్ అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జి. శేఖర్ పాల్గొన్నారు.

## వరి నాట్లకు వచ్చి.. వలస కూలీ మృతి

**కారు ఢీకొని పశ్చిమ బెంగాల్ యువకుడికి తీవ్ర గాయాలు**

**ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి**

**ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసుల గాలింపు**



కాకతీయ, రాయపర్తి : జీవనోపాధి కోసం సొంతూరును వదిలి వందల కిలోమీటర్లు వచ్చిన ఓ వలస కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వరి నాట్లు వేసేందుకు పశ్చిమ బెంగాల్ నుంచి రాయపర్తికి వచ్చిన సత్యం (25) గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సత్యం నెల రోజుల క్రితం తోటి కూలీలతో కలిసి వరి నాట్ల పనుల కోసం రాయపర్తి మండలానికి వచ్చాడు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని అంగడిలో కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేశాడు. అనంతరం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి దాటుతుండగా ఖమ్మం నుంచి వరంగల్ వైపు వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని కారు అదుపుతప్పి అతడిని ఢీకొట్టింది. ప్రమాదంలో సత్యం తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో సత్యాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించే పనిలో ఉన్నారు.

### పీ ఆర్ టీ యూ టీఎస్ మండల
## అధ్యక్షుడిగా గాదె ప్రవీణ్ రెడ్డి




కాకతీయ, రాయపర్తి : పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం రాయపర్తి మండల నూతన అధ్యక్షుడిగా గాదె ప్రవీణ్ రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవుల రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్ మాట్లాడుతూ, సెప్టెంబరు ఒకటిన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీ ఆర్ టీ యూ టీఎస్‌తోనే సాధ్యమని అన్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకులు, సహచర ఉపాధ్యాయులకు గాదె ప్రవీణ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల విడుదల, బదిలీలు, పదోన్నతుల సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్. ప్రసాద్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘు, ఉగ్గే రమేష్, వెంకటేశ్వర్లు, వినోద్ రెడ్డి, శ్రీనివాస్ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.